వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 57 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



# భగ్గుమన్న లద్దాఖ్

## లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్

- ఉద్రిక్తంగా మారిన ఆందోళన
- పోలీస్ కాల్పుల్లో నలుగురు మృతి
- 30 మందికి గాయాలైనట్లు అధికారులు వెల్లడి

**శ్రీనగర్**

లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ లేహ్ నగరంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మృతి చెందారు. మరో 30 మందికి గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే, పోలీసులు జరిపిన కాల్పుల్లోనే నలుగురు యువకులు మృతిచెందారని, గాయపడిన వారి సంఖ్య ఎక్కువ ఉందని -మిగతా 3 లో



# ఉరి తీస్తున్నారంటేనే అత్యవసర కేసు

- మిగతావేవీ అత్యసవరంగా పరిగణించం
- సుప్రీం కోర్టు స్పష్టీకరణ

**న్యూఢిల్లీ**

అత్యవసర విచారణకు సంబంధించి దాఖలు చేసిన ఓ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఎవరినైనా ఉరి తీస్తున్నారంటే తప్ప మరే కేసునూ అదేరోజున అత్యవసరంగా విచారించబోమని జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయమూర్తులపై ఉండే ఒత్తిడి, పని గంటల గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించింది. తాము ఎన్ని గంటలు నిద్రపోతున్నామో తెలుసా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. బుధవారం ధర్మాసనం అత్యవసర జాబితా కోసం కేసులను పరిశీలిస్తున్న నేపథ్యంలో శోభా గుప్తా అనే న్యాయవాది ఓ పిటిషన్‌ను న్యాయస్థానానికి అందజేశారు. రాజస్థాన్‌లోని ఒక నివాసగృహాన్ని ఈరోజు వేలం వేయనున్నారని.. ఈ రోజు విచారణ జరపకపోతే ఇల్లు -మిగతా 3 లో

# గ్రూప్ 1 మెయిన్స్ ర్యాంకర్లకు ఊరట

## పునఃమూల్యాంకన ఆదేశాలపై స్టే

- సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు చేసిన ధర్మాసనం
- అక్టోబర్ 16కు విచారణ వాయిదా

**హైదరాబాద్**

గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు స్టే విధించింది. ఈ అంశంలో టీజీపీఎస్సీకి హైకోర్టులో ఊరట లభించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించింది. గ్రూప్-1 నియామకాలు చేపట్టుకోవచ్చని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను వచ్చేనెల 16కి వాయిదా వేసింది.గ్రూప్-1 తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్స్‌ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ బెంచ్ తీర్పు వెలువరించింది. మెయిన్స్ జవాబు పత్రాలను -మిగతా 3 లో






# ఆర్టీసీలో ఏఐ వినియోగం

- మరింత వేగంగా సేవలకు నిర్ణయం
- ఏఐ వినియోగం కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటు
- ఆర్టీసీ యాజమాన్యానికి మంత్రి పొన్నం అభినందన

**హైదరాబాద్,**

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమ సేవలను మెరుగు పరుచుకునేందుకు ఆర్‌టిసి మరో గొప్ప అడుగు వేసింది. అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను విస్తృతంగా వినియోగించాలని నిర్ణయించింది. తమ ఉత్పాదకత పెంపు, సిబ్బంది పనితీరు, ఆరోగ్య స్థితి పర్యవేక్షణ, ఖర్చుల తగ్గింపు, రద్దీకి అనుగుణంగా సర్వీసుల ఏర్పాటుతో పాటు- సేవలను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశం. దేశంలోనే తొలిసారిగా ఎఐ వినియోగించిన ప్రజా రవాణా సంస్థగా తెలంగాణ ఆర్‌టిసి నిలిచింది. ఎఐ ప్రాజెక్టు అమలుకు హన్స ఈక్విటీ- పార్ట్‌నర్స్ ఎల్‌ఎల్‌పి అనే సంస్థ ఆర్‌టిసికి తోడ్పాటు- అందిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, ప్రణాళికాబద్ధమైన అమలు వ్యూహాలను -మిగతా 3 లో



# లష్కరే తోయిబా టెర్రరిస్ట్ అరెస్ట్..!

- పహల్గాం ఉగ్రవాదులకు ఆయుధాల సరఫరా..

**న్యూఢిల్లీ**

పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులకు సహకరించిన వ్యక్తి పోలీసులకు చిక్కాడు. కశ్మీర్‌కు చెందిన మొహమ్మద్ యూసుఫ్ కఠారియాను బుధవారం జమ్ముకశ్మీర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుల్గాం ప్రాంతానికి చెందిన ఇతడు పహల్గాం దాడికి పాల్పడిన ది రెసిస్టంట్ ఫ్రంట్ ముష్కరులకు కఠారియా ఆయుధాలు సమకూర్చాడు. ఇతడిని లష్కరే తోయిబా ఉగ్రవాదిగా గుర్తించారు పోలీసులు. దాదాపు ఐదు నెలలుగా టెర్రరిస్టులకు సాయం చేసిన వ్యక్తి కోసం వెతుకుతుకున్న పోలీసులు ఎట్టకేలకు కఠారియాను పట్టుకున్నారు. అతడిని 14 రోజులు తమ కస్టడీలోకి తీసుకున్నారు.కఠారియా కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తున్నాడు. అంతేకాదు స్థానికంగా పిల్లలకు పాఠాలు కూడా చెబుతుంటాడు. కొన్ని నెలల క్రితమే అతడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఏర్పడ్డాయి. కుల్గాం అటవీ మార్గంలో టెర్రరిస్టు గ్రూప్‌ల కార్యకలాపాలకు కఠారియా సహకరించాడు. అలానే పహల్గాంలోని -మిగతా 3 లో

# బీహార్‌కు కేంద్రం వరాల జల్లు

- ఎన్నికల దృష్ట్యా పలు ప్రాజెక్టులకు ఆమోదం
- రూ.6వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులు
- దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 5023 ఎంబీబీఎస్ సీట్ల పెంపు
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ,**

అసెంబ్లీ ఎన్నికల వేళ బిహార్‌పై కేంద్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. రాష్ట్రంలో సుమారు రూ.6వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దీంతో పాటు దేశవ్యాప్తంగా వైద్యవిద్య సీట్ల పెంపునకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలకు సంబంధించిన వివరాలను కేంద్ర -మిగతా 3 లో



# బీహార్ ఎన్నికలతో మోడీ పాలనకు ముగింపు

## అభివృద్ధి, సంక్షేమాన్ని కోరుకుంటున్న ప్రజలు

- నితీశ్ కుమార్‌ను భారంగా భావిస్తున్న బిజెపి
- ఎన్‌డిఎలో తారాస్థాయికి అంతర్గత కలహాలు
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఖర్గే

**పాట్నా,**

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవినీతి పాలన ముగింపునకు నాంది పలుకుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బిహార్ ప్రజలు బీజేపీ రెలిజియస్ పోలరైజేషన్‌పై ఏమాత్రం ఆసక్తిగా లేరని, అభివృద్ధి, సంక్షేమంతో కూడిన రాజకీయాలను కోరుకుంటున్నారని చెప్పారు. బిహార్‌లోని ఎన్డీయేలో అంతర్గత కలహాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నా యని, ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను ఒక భారంగా బీజేపీ భావిస్తోందని అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాన్ని ఖరారు చేసేందుకు, ఓట్ చోరీ అంశంపై బీజేపీని మరింత ఇరకాటంలో పెట్టే విషయమై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం బిహార్ రాజధాని పాట్నాలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయమైన సదాకత్ ఆశ్రమంలో బుధవారంనాడు -మిగతా 3 లో



# మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణం


- రూ 525.36 కోట్ల వ్యయంతో పనులు
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగులేటి


3 లో

# బుల్డోజర్ న్యాయంపై ఆదేశాలివ్వడం సంతృప్తినిచ్చింది

## సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్

**న్యూఢిల్లీ**



బుల్డోజర్ న్యాయంపై ఆదేశాలివ్వడంతో తనకు ఎంతో సంతృప్తి కలిగిందని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ చెప్పారు. ఈ తీర్పు వెనుక మానవతావాద అంశం కూడా ఉందన్నారు.కుటుంబంలో ఒకరు నేరస్థుడైనంత మాత్రానికి ఆ కుటుంబంలోని అందరినీ వేధించరాదన్నారు. మంగళవారం జరిగిన సుప్రీంకోర్టు న్యాయవాదుల అకడమిక్ గ్రూప్ 269వ ఫ్రైడే గ్రూప్ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# గిగ్ వర్కర్లకు ద్రోహం చేసిన కాంగ్రెస్

- ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు మోసం
- వారి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- గిగ్ వర్కర్లకు కేటీఆర్ భరోసా




**హైదరాబాద్,**

గిగ్ వర్కర్స్‌కు కాంగ్రెస్ పార్టీ తీరని ద్రోహం చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ అన్నారు. అభయ హస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో గిగ్ వర్కర్స్ కోసం ప్రత్యేక డిక్లరేషన్ విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ సభ్యులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని అన్నారు. గిగ్ వర్కర్స్‌కు అండగా ఉంటామన్న కేటీఆర్... వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కాంగ్రెస్ హామీ -మిగతా 3 లో

# బీజేపీ క్రమంగా బలపడుతోంది

- అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధిస్తాం
- జూబ్లీహిల్స్ ఎన్నికల్లోనూ మనదే విజయం
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

3 లో



# నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ ఆ పని చేయాలి.

## ఫ్రాన్స్ అధ్యక్షుడి సలహా..!


**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం తహతహలాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ బహుమతి కావాలంటే ఆయన గాజాలో యుద్ధం ఆపాలని సలహా ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి సమావేశాల కోసం అమెరికాకు వచ్చిన మాక్రాన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన.. 'నాకు శాంతి కావాలి. నేను అనేక యుద్ధాలు ఆపాను' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఐరాస సమావేశంలో చెప్పిన విషయాన్ని మాక్రాన్ ప్రస్తావించారు. యుద్ధం ఆపిన వారికే నోబెల్ శాంతి బహుమతి వస్తుందని, అయితే గాజాలో ఇంకా మారణహోమం ముగియలేదని వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేలా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చే శక్తి అమెరికాకు మాత్రమే ఉందని, ట్రంప్ మాత్రమే ఆ పని చేయగలదని ఆశాభావం వ్యక్తంచేశారు. ట్రంప్ గాజా యుద్ధాన్ని ముగించడంలో విజయం సాధిస్తేనే ఆయనను నోబెల్ బహుమతి వరిస్తుందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన అమెరికాపై పలు విమర్శలు చేశారు. గాజాలో మారణహోమానికి తాము ఎలాంటి ఆయుధాలు పంపడం లేదని, అమెరికానే ఇజ్రాయెల్‌కు ఆ సాయం చేస్తోందని ఆరోపించారు. పాలస్తీనా ప్రత్యేక దేశంగా మారడమనేది ఇజ్రాయెల్ పైనే ఆధారపడి ఉంటుందని మాక్రాన్ అన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌తో సహా పలు దేశాలు పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాయి. ఈ క్రమంలో తమ చర్యకు ఇజ్రాయెల్ నుంచి ప్రతీకార చర్య కచ్చితంగా ఉంటుందని మాక్రాన్ అన్నారు. వాటన్నింటికీ తాము సిద్ధంగా ఉన్నామని, యుద్ధం ముగించడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు.

# అసెంబ్లీ ఎన్నికల వేళ బీహార్‌పై వరాల జల్లు..!

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**



ఏ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ఆ రాష్ట్రంలో ఓట్ల కోసం వరాలు కురిపించడం కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారుకు రివాజుగా మారింది. ఇప్పుడు బీహార్ అసెంబ్లీ ఎన్నికలవేళ కూడా కేంద్రం అదే సాంప్రదాయాన్ని కొనసాగించింది. ఆ రాష్ట్రంలో సుమారు రూ.6 వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. వాటికి సంబంధించిన వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.రైల్వేకు సంబంధించి బీహార్‌లో రూ.2,192 కోట్లతో భక్తియార్‌పూర్-రాజ్‌గిర్-తిలయ్యా డబ్లింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక సాహెబ్‌గంజ్-అరెరాజ్-బెతియా మధ్య రూ.3,822 కోట్లతో 78.9 కిలోమీటర్ల నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుతో రాజధాని పట్నా-బెతియా మధ్య కనెక్టివిటీ మెరుగు పడుతుందని పేర్కొంది. వీటితోపాటు దేశీయ నౌకా నిర్మాణం, సముద్ర రంగాల పునరుజ్జీవనానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.69,725 కోట్ల ప్యాకేజీకి ఆమోదం తెలిపింది.దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేయడంలో భాగంగా కేంద్ర కేబినెట్ మరో నిర్ణయం తీసుకుంది. కొత్తగా 5 వేల పీజీ సీట్లకు ఆమోదం తెలిపింది. వీటితోపాటు కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం (CSS) మూడో ఫేజ్ కింద 2028-29 నాటికి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 5,023 ఎంబీబీఎస్ సీట్లను పెంచాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు సంబంధించి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పూర్తి

# పారాసిటమాల్ సురక్షితమైంది

## డబ్ల్యూహెచ్‌వో


World Health Organization

**జెనీవా - ప్రజా స్వేచ్ఛ**

:పెయిన్ కిల్లర్ టైలినాల్(ఇండియాలో పారాసిటమాల్)ను గర్భిణీ స్త్రీలు వాడకూడదని ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ డ్రగ్ వాడకం వల్ల ఆటిజం పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రపంచ ఆరోగ్య సంస్థ కొట్టిపారేసింది. ప్రెగ్నెన్సీ సమయంలో పారాసిటమాల్ ట్యాబ్లెట్లను వాడడం వల్ల ఆటిజం పిల్లలు పుట్టే అవకాశాలు ఉన్నాయన్న వాదనకు ఆధారాలు లేవని డబ్ల్యూహెచ్‌వో పేర్కొన్నది. జెనీవాలో డబ్ల్యూహెచ్‌వో ప్రతినిది తారిక్ జాసరవిక్ మాట్లాడుతూ.. టైలినాల్, ఆటిజం మధ్య ఉన్న లింకు అంశంలో ఆధారాలు సరిగా లేవన్నారు. వ్యాక్సిన్ల వల్ల ఆటిజం రాదన్న విషయం తెలుసు అని, టీకాలు కోట్లాది మంది ప్రాణాలను కాపాడుతున్నాయని, ఇది శాస్త్రీయంగా నిర్ధారణ జరిగిందని, దీన్ని ప్రశ్నించలేమని డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి తారిక్ తెలిపారు. డబ్ల్యూహెచ్‌వో చెప్పిన విషయాన్నే యురోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ కూడా సమర్థించింది. ఈయు దేశాల్లో పారాసిటమాల్‌ను అసిటమినోఫిన్‌గా వాడుతుంటారు. ప్రెగ్నెన్సీ మహిళల్లో నొప్పులు, జ్వరం వస్తే ఆ మందునే వినియోగిస్తారు. అయితే ప్రస్తుతం ఆ మాత్రలను మార్చే కొత్త ప్రతిపాదనలు ఏమీ లేవని యురోపియన్ మెడికల్ ఏజెన్సీ పేర్కొన్నది. జ్వరంతో ఉన్న ప్రెగ్నెంట్ మహిళలకు పారాసిటమాల్‌నే వాడుతామని ఈఎంఏ చీఫ్ మెడికల్ ఆఫీసర్ స్టీఫెన్ తిర్‌స్ట్రుప్ తెలిపారు. ప్రెగ్నెన్సీలో పారాసిటమాల్ వాడితే దాని వల్ల పిల్లల్లో ఆటిజం వస్తుందన్న ఆధారాలు తమ వద్ద లేవన్నారు. ట్రంప్ ఆదేశాల తర్వాత అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ స్పందించింది. అసిటమినోఫెన్ ఉత్పత్తులకు వార్నింగ్ లేబుల్స్ జత చేయనున్నట్లు ఎఫ్‌డీఏ చెప్పింది. గర్భం దాల్చిన సమయంలో ఈ మందును వాడడం వల్ల నరాల సంబంధిత ఆటిజం వ్యాధి సోకే ప్రమాదం ఉందని ఆ హెచ్చరికలో తెలుపనున్నట్లు ఎఫ్‌డీఏ పేర్కొన్నది. టైలినాల్ వాడకం వల్ల ఆటిజం వస్తుందన్న ట్రంప్ వ్యాఖ్యలను ఆ మందు తయారీ చేసే కెన్‌వూ కంపెనీ కొట్టిపారేసింది. అసిటమినోఫెన్ తీసుకోవడం వల్ల ఆటజం రాదన్న విషయాన్ని శాస్త్రీయంగా నిర్ధారించినట్లు ఆ కంపెనీ చెప్పింది. పారాసిటమాల్ వినియోగంపై భారత ప్రభుత్వ ఆరోగ్య శాఖ ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు.

# యూఎన్‌లో మళ్లీ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన టర్కీ అధ్యక్షుడు

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**



ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో టర్కీ అధ్యక్షుడు తయిప్ ఎర్డగోన్ తన ప్రసంగంలో కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. ఇటీవల భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, అయితే ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరగడం సంతోషకరంగా ఉందన్నట్లుగా ఆయన పేర్కొన్నారు. కౌంటర్ టెర్రరిజం అంశంలో భారత్, పాక్ దేశాల మధ్య సహకారం కీలకమైందన్నారు. కశ్మీర్ ప్రజల క్షేమం కోసం ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం కశ్మీర్ సమస్యను పరిష్కరించాలని, చర్చల ద్వారా ఆ పని జరగాలని ఎర్డగోన్ అభిప్రాయపడ్డారు. దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వం ఉండాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. గత ఏప్రిల్‌లో పాకిస్థాన్, భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, దీని వల్ల తీవ్ర సంక్షోభ పరిస్థితులు తలెత్తాయని ఎర్డగోన్ అన్నారు. యూఎన్ జనరల్ అసెంబ్లీ 80వ సెషన్ సందర్భంగా జరిగిన జనరల్ డిబేట్‌లో పాల్గొని మాట్లాడారు.ఇటీవల టర్కీ అధ్యక్షుడు పలుమార్లు కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ దేశాల ముందు ప్రస్తావించారు. గతంలో కూడా యూఎన్ జనరల్ అసెంబ్లీ సమావేశాల్లోనూ కశ్మీర్ అంశం గురించి ఆయన మాట్లాడారు. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7వ తేదీన భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను భారతీయ రక్షణ దళాలు ధ్వంసం చేశాయి. మే 10వ తేదీ వరకు పాకిస్థాన్‌పై ఇండియా తీవ్రంగా అటాక్ చేసింది.

# బీజేపీ అధికారం దక్కనందుకే జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా ఇవ్వలేదు

## - ఒమర్ అబ్దుల్లా



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

కేంద్రంలోని అధికార బీజేపీ పై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. జమ్ముకశ్మీర్‌కు తిరిగి రాష్ట్రహోదా ఇవ్వకపోవడంపై ఆయన మండిపడ్డారు. జమ్ముకశ్మీర్‌లో బీజేపీ అధికారం కోల్పోయిందని, అందుకే రాష్ట్రహోదా ఇవ్వలేదని ఆరోపించారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పించడంలో జాప్యం చేయడమంటే అది అక్కడి ప్రజలకు అన్యాయం చేయడమేనని వ్యాఖ్యానించారు.బుధవారం ఒమర్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ.. 'జమ్ముకశ్మీర్ ప్రజలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. ఎన్నికల్లో బీజేపీ గెలువకపోవడం వాళ్ల దురదృష్టం. ఏదేమైనా అందుకోసం ఇక్కడి ప్రజలు శిక్ష అనుభవించొద్దు. చూడబోతే ఎన్నికల్లో బీజేపీ గెలువలేకపోయినందుకే జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా ఇవ్వడం లేదేమో అనిపిస్తున్నది. ఇది ప్రజలపాలిట అన్యాయం. ఫలితాలు బీజేపీ అనుకూలంగా ఉంటేనే రాష్ట్రహోదా ఇస్తామనుకోవడం కరెక్ట్ కాదు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదాపై వ్యతిరేకత బీజేపీ నుంచే వస్తోంది' అన్నారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పించే విషయంలో తాము డీలిమిటేషన్, ఎలక్షన్స్, స్టేట్‌హుడ్ అనే 'త్రీ స్టెప్ ఫార్ములా'ను అమలుచేస్తామని కేంద్రం సుప్రీంకోర్టుకు చెప్పిందని, ఇప్పుడు త్రీ స్టెప్స్ పూర్తయినా రాష్ట్రహోదాను మాత్రం కల్పించలేదని ఒమర్ అబ్దుల్లా ఆరోపించారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ అనేది అతిపెద్ద సవాల్ అని వ్యాఖ్యానించారు.

# ఎవరినైనా ఉరితీస్తున్నారంటే తప్ప నేను ఆ పని చేయను'..

## సుప్రీంకోర్టు సీనియర్ జడ్జి కామెంట్




**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**

దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు లో బుధవారం ఉదయం ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. ఓ సీనియర్ న్యాయవాది .. తన క్లయింట్ పిటిషన్‌పై అత్యవసరంగా ఇదేరోజు విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయమూర్తి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశాలున్న జస్టిస్ సూర్యకాంత్ ను కోరారు. దాంతో ఆయన వెంటనే స్పందించారు. సదరు న్యాయవాదిని ఉద్దేశించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు.న్యాయవ్యవస్థ భారీగా పనిభారాన్ని మోస్తోందని అన్నారు. తాము (న్యాయమూర్తులు) సరిపడా నిద్రకూడా పోవడం లేదు తెలుసా..? అని వ్యాఖ్యానించారు. 'ఎవరినైనా ఉరితీస్తున్నారంటే తప్ప మరే పిటిషన్‌ను కూడా నేను అదేరోజు విచారణకు స్వీకరించను. న్యాయమూర్తులు అవస్థలు మీకు అర్థంకావు. మేం రోజుకు ఎన్ని గంటలు నిద్రపోతున్నామో మీకు తెలుసా..?' అని ప్రశ్నించారు.తన క్లయింట్‌కు సంబంధించిన ఇంటిని ఇవాళ వేలం వేస్తున్నారని, అతడి పిటిషన్‌పై ఈరోజే అత్యవసరంగా విచారణ జరుపాలని ఓ సీనియర్ న్యాయవాది కోరడంతో జస్టిస్ సూర్యకాంత్‌పై వ్యాఖ్యలు చేశారు. ఎవరినైనా ఉరితీస్తున్నారంటే తప్ప మరే పిటిషన్‌ను కూడా తాను అదేరోజు విచారణకు స్వీకరించేది లేదని తేల్చిచెప్పారు. కాగా జస్టిస్ సూర్యకాంత్‌కు సీనియారిటీపరంగా సీజేఐ పదవికి దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు జనాల్లో ఆసక్తిరేపాయి.

# సీడీఎస్ అనిల్ చౌహాన్ పదవీ కాలం పొడిగింపు

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**



చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలాన్ని ఎనిమిది నెలలపాటు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. 2026 మే 30 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన పదవీ కాలాన్ని పొడిగించేందుకు క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది.భారత ప్రభుత్వ సైనిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా కూడా ఆయన బాధ్యతలను కొనసాగిస్తారు. ఆయన సీడీఎస్‌గా 2022 సెప్టెంబరు 28న నియమితులయ్యారు. ఆయన 1981లో భారత సైన్యంలో చేరారు. ఆయన సేవలకు గుర్తింపుగా పరమ విశిష్ట సేవా పతకం, ఉత్తమ యుద్ధ సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, విశిష్ట సేవా పతకం లభించాయి.

# భగ్గుమన్న లద్దాఖ్

(మొదటి తరువాయి)

ఆందోళనకారులు ఆరోపించారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాతోపాటు- ఆరో షెడ్యూల్ పొడిగింపు డిమాండ్ చేస్తూ స్థానికంగా కొంతకాలంగా స్థానికంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 10 నుంచి ఓ పదిహేను మంది ఆమరణ దీక్షకు దిగారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో సెప్టెంబర్ 23 సాయంత్రం వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో లద్దాఖ్ అపెక్స్ బాడీ యువజన విభాగం తాజా నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే లేహ్ నగరంలో అనేక మంది వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. వీరిని చెదరగొట్టేందుకు వచ్చిన భద్రతా దళాలపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. స్థానిక భాజపా కార్యాలయానికి, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. ఒక్కసారిగా పరిస్థితులు హింసాత్మకంగా మారాయి. వీటిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన పోలీసులు ఫైరింగ్ చేశారు. అనంతరం లేహ్ జిల్లాలో నిషేధాజ్ఞలు విధించారు. లేహ్‌లో చోటు-చేసుకున్న హింసపై పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాంతియుతంగా చేపట్టిన నిరసనలు ఎలాంటి ఫలితాలు ఇవ్వకపోవడంతోనే యువత నిస్పృహ చెందారన్నారు. ఇవే తాజా ఘటనలకు దారితీశాయన్న ఆయన.. పలువురు యువకులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్ కు రాష్ట్ర హోదా కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ 15 రోజులుగా సాగిస్తున్న నిరాహార దీక్షను విరమించారు. రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ లెహ్ నగరంలో పెద్ద ఎత్తున ఆందోళనకారులు బుధవారంనాడు రోడ్లపైకి వచ్చారు. పోలీసులతో ఘర్షణకు దిగడం, రాళ్లురువ్వడం, సీఆర్‌పీఎఫ్ వాహనంతో పాటు- బీజేపీ కార్యాలయానికి నిప్పుపెట్టడం వంటి హింసాత్మక చర్యలకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. ఈ నేపథ్యంలో ఉద్యమం హింసాత్మక రూపు దాల్చడంతో తన నిరాహార దీక్షను విరమిస్తున్నట్టు- సోనం వాంగ్‌చుగ్ ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియో పోస్ట్ చేశారు.

## ఉరి తీస్తున్నారంటేనే అత్యవసర కేసు

(మొదటి తరువాయి)

చేజారిపోతుందని పేర్కొన్నారు. అందువల్ల దానిపై అత్యవసర విచారణ జరపాలని సుప్రీంకోర్టును కోరారు. దీనిపై స్పందిస్తూ.. జస్టిస్ సూర్యకాంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకరి స్వేచ్ఛ ప్రమాదంలో ఉంటే తప్ప తాము అత్యవసరంగా విచారణ చేపట్టబోమని స్పష్టంచేశారు. అనంతరం ఇల్లు వేలం నోటీసు ఎప్పుడు జారీ చేశారని జస్టిస్ సూర్యకాంత్ న్యాయవాదిని అడిగారు. గత వారం వేలం నోటీ-సు జారీ చేశారని.. బకాయి ఉన్న మొత్తంలో ఇప్పటికే సగం చెల్లించారని లాయర్ కోర్టుకు తెలియజేశారు. దీంతో శుక్రవారం ఈ పిటిషన్‌ను జాబితాలో చేర్చాలని న్యాయమూర్తి సూచించారు.

## గ్రూప్ 1 మెయిన్స్ ర్యాంకర్లకు ఊరట

(మొదటి తరువాయి)

8 నెలల్లో పునఃమూల్యాంకనం చేయించాలని.. లేదంటే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పుపై టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. దీనిపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. పిటిషన్ విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. మెయిన్స్ పత్రాలను పునఃమూల్యాంకనం చేయాలని ఆదేశించింది. 8 నెలల్లోపు చేయకపోతే మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని స్పష్టం చేసింది. 2011లో గ్రూప్-1 నిర్వహించారు. ఆ తర్వాత 2022లో నిర్వహిస్తే సుప్రీంకోర్టు రద్దు చేసింది. 14 ఏళ్ల తర్వాత గ్రూప్-1 నియామకాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో ప్రక్రియను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. తెలుగులో మెయిన్స్ జవాబులు రాసిన వారిపట్ల పక్షపాతం చూపించారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని కోర్టుకు ఏజీ తెలిపారు. దీనిపై సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ స్పందిస్తూ మాల్ ప్రాక్టీస్, పేపర్ లీక్‌లాంటి ఘటనలు ఏమైనా చోటు-చేసుకున్నాయా? పక్షపాతం చూపించారనడానికి ఏమైనా ఆధారాలున్నాయా?అని ఏజీని ప్రశ్నించారు. ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయారని ఆయన తెలిపారు. ఏపీలో నిర్వహించిన గ్రూప్స్ పరీక్షల్లో తెలుగులో రాసిన అభ్యర్థులు తక్కువగా ఎంపికయ్యారని చెప్పారు. కోఠి మహిళా విశ్వవిద్యాలయంలో పురుషులకు వాష్‌రూమ్‌లు లేవని.. అందుకే ఆ రెండు కేంద్రాల్లో మహిళలకు మాత్రమే కేటాయించామని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని వాళ్లకు సమీపంలోని కేంద్రాలు కేటాయించామన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్లు- జారీ చేయడాన్ని సైతం తప్పుబట్టారని ఏజీ తెలిపారు. హాల్ టికెట్ల జారీ విషయంలో టీజీపీఎస్సీకి అధికారం ఉంటుందని.. పరీక్ష కేంద్రాల కేటాయింపును తప్పుబట్టలేమని సీజే అన్నారు. అనంతరం సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ డివిజన్ బెంచ్ ఆదేశాలు ఇచ్చింది. తుది తీర్పునకు లోబడే నియామకాలు ఉంటాయని సీజే జస్టిస్ ఏకే సింగ్ స్పష్టం చేశారు. డివిజన్ బెంచ్ స్టే విధించడంతో గ్రూప్-1 ర్యాంకర్లకు ఊరట లభించింది. ఈ తీర్పుతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## లష్కరే తోయిబా టెర్రరిస్ట్ అరెస్ట్..!

(మొదటి తరువాయి)

బైసరన్ లోయలో ఏప్రిల్ 22వ తేదీన.. మతం ఏంటీ? అని అడిగి మరీ 25 మంది హిందూ పర్యాటకులను చంపేసిన ఉగ్రవాదులకు కఠారియానే అన్నీ సమకూర్చాడు. అందుకే.. అతడిని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.పహల్గాం దాడిలో పాల్గొన్న వాళ్లకు సామగ్రి సమకూర్చారని జూన్ నెలలో జాతీయ దర్యాప్తు సంస్థ ఇద్దరిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. జూలైలో భారత సైనికులు చేపట్టిన 'ఆపరేషన్ మహదేవ్' లో ముగ్గురు లష్కరే ప్రధాన ఉగ్రవాదులు సులేమాన్ షా, అఫ్గన్, జిబ్రాన్‌లు హతమయ్యారు. ఈ ముగ్గురు పహల్గాం దాడిలో పాల్గొన్నారని కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వెల్లడించారు.

## బీహార్ ఎన్నికలతో మోడీ పాలనకు ముగింపు

(మొదటి తరువాయి)

నిర్వహించారు. ఖర్గే అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నేత రాహుల్ గాంధీ, కోశాధికారి అజయ్ మాకెన్, ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్, బిహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు, పార్టీ ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు హాజరయ్యారు. జాతీయంగా, అంతర్జాతీయంగా దేశం పెక్కు సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో సీడబ్ల్యూసీ సమావేశం జరుగుతోందని ఖర్గే ఈ సందర్భంగా అన్నారు. మోదీ, ఆయన ప్రభుత్వ దౌత్య వైఫల్యాల కారణంగానే అంతర్జాతీయంగా మనం సమస్యలను ఎదుర్కొంటున్నామని విమర్శించారు. మోదీ నా ఫ్రెండ్ అని చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంపే ఇప్పుడు ఇండియాను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఓటు చోరీ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకతపై ఆందోళనలు తలెత్తుతున్నాయని ఖర్గే అన్నారు. వివిధ రాష్ట్రాల్లో అవకతవకలను రాహుల్ లేవనెత్తుతుంటే వాటిని పరిష్కరించకుండా అఫిడవిట్లు సమర్పించాలని ఈసీ ఒత్తిడి తెస్తోందన్నారు. బిహార్ తరహాలోనే దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్లను తొలగించేందుకు ప్రస్తుతం కుట్ర జరుగుతోందని ఖర్గే ఆరోపించారు. ఓట్ చోరీ అంటే రేషన్, పెన్షన్, మెడిసన్, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, పేదల హక్కులను దొంగిలించడమేనని అన్నారు. ప్రజలు బహిరంగంగానే మోడీ తీరును ఎండగడుతున్నారని మండిపడ్డారు.

# ఆర్టీసీలో ఏఐ వినియోగం

(మొదటి తరువాయి)

అందించి, అన్ని డిపోల్లో సులభంగా అమలు జరిగేలా ఆ సంస్థ సహకరిస్తోంది. సంస్థలో ఎఐ వినియోగం కోసం ఒక ప్రత్యేక టీంను యాజమాన్యం ఏర్పాటు- చేసింది. సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి, అవగాహన ఉన్న అధికారులను గుర్తించి ఆ టీ-ంలో ప్రాధాన్యం ఇచ్చింది. ఎఐ వాడకంపై ఆ టీమ్‌కు హన్స ఈక్విటీ- పార్ట్‌నర్స్ శిక్షణ ఇస్తోంది. ఎఐ ప్రాజెక్టులో భాగంగా మొదట 40 వేల మంది సిబ్బంది ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తున్నారు. గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ లో భాగంగా ఉద్యోగులకు చేసిన వైద్య పరీక్షల ఆధారంగా ఆరోగ్య పరిస్థితిని ఎఐ, మెషిన్ లెర్నింగ్ సహకారంతో అంచనా వేస్తున్నారు. మొదట పైలట్ ప్రాజెక్టుగా ఆరు డిపోల్లో అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం అన్ని డిపోల్లోనూ ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. త్వరలోనే ఎఐ ద్వారా ఆటోమెటిక్ షెడ్యూలింగ్‌ను సంస్థ ఎ÷-లాన్ చేస్తోంది. రోజు, తిథి, పండుగులు, వారాల్లో ఎఐ మెషిన్ లెర్నింగ్ సహకారంతో ప్రయాణికుల రద్దీని అంచనా వేసి ఆ మేరకు బస్సులను సంస్థ ఏర్పాటు- చేయనుంది. ఆర్‌టిసిలో ఎఐ ప్రాజెక్ట్ అమలు తీరు గురించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇటీ-వల రవాణా, బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ ఉన్నతాధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్‌టిసి ఎండి, విసి సజ్జనార్, ఆర్‌టిసి ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆధునిక రవాణా అవసరాలకు అనుగుణంగా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు- సంస్థను ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేయడం కోసం 2021 నుంచే అమలు చేస్తున్న స్ట్రాటజిక్ డిప్లొయ్మెంట్ ప్లాన్ (ఎస్‌డిపి) కీలక పాత్ర పోషిస్తున్నదని ఆర్‌టిసి ఉన్నతాధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి నెలా ఎస్‌డిపి సమీక్షా సమావేశాలను నిర్వహిస్తూ, స్వల్పకాలిక - దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి అమలులో సంస్థ చురు-కై-న చర్యలు తీసుకుంటు-న్నదని వివరించారు. తమ పనితీరు మెరుగుపరచుకోడానికి ఎఐని వినియోగించుకోవడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు. ఆర్‌టిసి ఉన్నతాధికారుల కృషిని అభినందించారు.ప్రపంచంలో ప్రస్తుతం ఎఐ ప్రభావితం చేయని రంగమే లేదని, రవాణా వ్యవస్థలో మార్పులను గుర్తించి ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా ఎఐని వినియోగించుకోవాలని భావించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఈ ఎఐ ప్రాజెక్ట్ అమలుకు సమష్టిగా పనిచేసి ఆర్‌టిసి మరింత అభివృద్ధి సాధించేలా అధికారులందరూ కృషి చేయాలని సూచించారు. సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా పనిచేస్తూ 2021 నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ఎస్‌డిపి అమలు, ఎఐ ప్రాజెక్ట్ రూపకల్పనలో విశేషంగా తోడ్పడిన హన్స ఈక్విటీ- పార్ట్‌నర్స్ ఎల్‌ఎల్‌పికి చెందిన త్రినాథబాబు, సునీల్ రేగుళ్లను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించి, సన్మానించారు. సంస్థను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బలోపేతం చేసేందుకే ఎఐ ప్రాజెక్టు అమలు చేస్తున్నామని ఆర్‌టిసి ఎండి సజ్జనార్ తెలిపారు. ఎఐ వినియోగం వల్ల సేవల్లో మరింత వేగం, కచ్చితత్వం, స్పష్టత ఉంటు-ందని ఆయన వివరించారు. ప్రయాణికుల అవసరాలు, ట్రాఫిక్ పరిస్థితులను బట్టి స్మార్ట్ షెడ్యూలింగ్ సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజా రవాణా రంగంలో సాంకేతికతను వినియోగించి దేశంలోనే తొలి మోడల్‌గా టిజిఎస్ ఆర్‌టిసి నిలవడం గర్వకారణమని అన్నారు.ఈ సమావేశంలో సంస్థ ఈడీలు మునిశేఖర్, ఖుస్రోషా ఖాన్, వెంకన్న, రాజశేఖర్, సిటిఎం శ్రీదేవి, సిపిఎం ఉషాదేవి, సిఈఐటి శ్రీదేవి తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీహార్‌కు కేంద్రం వరాల జల్లు

(మొదటి తరువాయి)

మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. బిహార్‌లో రైల్వేకు సంబంధించి రూ.2192 కోట్లతో భక్తియార్‌పుర్-రాజ్‌గిర్-తిలయ్యా డబ్లింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇక సాహెబ్‌గంజ్-అరెరాజ్-బెతియా మధ్య రూ.3822 కోట్లతో 78.9 కి.మీ నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుతో రాజధాని పట్నా-బెతియా మధ్య కనెక్టివిటీ- మెరుగు పడుతుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వీటితోపాటు- దేశీయ నౌకా నిర్మాణం, సముద్ర రంగాల పునరుజ్జీవనానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.69,725 కోట్ల ప్యాకేజీకి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలను బలోపేతం చేయడంలో భాగంగా కేంద్ర కేబినెట్ మరో నిర్ణయం తీసుకుంది. కొత్తగా 5వేల పీజీ సీట్లకు ఆమోదం తెలిపింది. వీటితోపాటు- కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం మూడో ఫేజ్ కింద 2028-29 నాటికి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 5023 ఎంబీబీఎస్ సీట్లను పెంచాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు సంబంధించి కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పూర్తి మార్గదర్శకాలు జారీ చేయనుంది. దేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య సీట్లలో భారీ పెంపునకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపింది. 5,023 ఎంబీబీఎస్ సీట్లను పెంచడానికి, ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడ్ కోసం సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఫలితంగా దేశంలో వైద్య విద్య సామర్థ్యాన్ని గణనీయంగా పెంచేందుకు వీలవుతుంది సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్ 3వ దశ కింద ప్రస్తుత ప్రభుత్వ వైద్య కళాశాలల అప్‌గ్రేడేషన్ ద్వారా 5,000 కొత్త పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్లు-, 5,023 ఎంబీబీఎస్ సీట్లు- పెంచేందుకు ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్లు- 1,18,190కి, పీజీ సీట్లు- 74,306కి చేరుకుంటాయి. మొత్తం రూ.15,034.50 కోట్ల బడ్జెట్ (2025-26 నుంచి 2028-29 వరకు)తో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ.10,303.20 కోట్లు- కాగా.. రాష్ట్రాల వాటా రూ.4,731.30 కోట్లు. ఈ విస్తరణ వైద్యులు, స్పెషలిస్టుల సంఖ్యను పెంచి గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరుస్తుంది. ఇది విద్యార్థులకు మరిన్ని వైద్య వృత్తి అవకాశాలు, ఉద్యోగాలు సృష్టించడంతోపాటు- భారతదేశాన్ని సరసమైన ఆరోగ్య సేవల గ్లోబల్ హబ్‌గా మార్చుతుంది. ఇప్పటికే దేశంలో 808 మెడికల్ కళాశాలలో 1,23,700 ఎంబీబీఎస్ సీట్లు- ఉన్నప్పటికీ, డిమాండ్‌కు తగ్గట్టు సామర్థం పెంచడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది.

# మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణం

**రూ 525.36 కోట్ల వ్యయంతో పనులు**

**ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి పొంగులేటి**



**ఖమ్మం,**

ఖమ్మం నగర ప్రజల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ 525.36 కోట్ల వ్యయంతో మున్నేరుకి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని ప్రజా ప్రభుత్వం చేపట్టింది. తెలంగాణలో విద్య, వైద్యం, వ్యవసాయ మార్కెటింగ్, వర్తక, వ్యాపార రంగాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఖమ్మం అగ్రగామిగా నిలుస్తుంది. అయితే ఖమ్మం నగరం మధ్య నుండి ప్రవహిస్తున్న మున్నేరు వాగు ప్రతి ఏటా వర్షాకాలంలో ఉధృతంగా పొంగి, పరిసర ప్రాంతాల ఇండ్లు, వర్తక , వ్యాపార సంస్థలు, పంటలు వరద ముంపునకు గురవుతున్నాయి. మారిన వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వస్తున్న ఆకస్మిక వర్షాలు, క్లౌడ్ బస్ట్ లతో ప్రభుత్వ మౌళిక వసతులకు కూడా తీవ్ర నష్టం జరుగుతున్నది. పనులకు వెళ్ళిన వారు, ఇంటికి వచ్చి సామాన్లు, నిత్యావసరాలు సర్దుకునే వెసులుబాటు- లభించదు. దీనితో వందలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి, కట్టు- బట్టలతో రోడ్డున పడుతున్నాయి. రోడ్లు ,విద్యుత్ స్తంబాలు, సబ్ స్టేషన్లు, పాఠశాల భవనాలు, తాగునీటి వసతు లు, పైపు లైన్లు , ఆరోగ్య కేంద్రాలు దెబ్బతింటు-న్నవి. రూరల్ మండలం లో పంటలు ముంపుకు గురవుతాయి. ఉదాహరణకు 2024 సెప్టెంబర్లో సంభవించిన క్లౌడ్ బస్ట్ తో మున్నేరుకు వచ్చిన ఆకస్మిక వరద ముంపుతో ప్రభుత్వ మౌలిక సదుపాయాలకు రూ. 757 కోట్ల నష్టం జరిగినట్లు- అధికారులు అంచనా వేశారు. వరద ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పర్యటించి, బాధిత కుటు-ంబాలను పరామర్శించారు. మున్నేరు వాగు రివిట్‌మెంట్ వాల్ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు వాగుకు 5,863 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నుండి గరిష్టంగా 10 వేల క్యుమెక్స్ వరద ప్రవహిస్తుంది. ఖమ్మం నగరం మధ్య నుండి ప్రవహిస్తున్న మున్నేరు వాగుకు ఎడమ వైపు డ్రైనేజ్ వ్యవస్థ ద్వారా 379 క్యూమెక్స్ , కుడి వైపు డ్రైనేజ్ వ్యవస్థ ద్వారా 605 క్యూమెక్స్ వరద డిశ్చార్జ్ అవుతుంది. పరివాహక ప్రాంతం, నగరం నుంచి వచ్చే వరద గరిష్ట స్థాయిని దృష్టిలో ఉంచుకుని, మున్నేరు వాగుకు రెండు వైపుల సిమెంట్ కాంక్రీట్ రక్షణ గోడ పనులను ప్రభుత్వం మంజూరు చేసింది.

# గిగ్ వర్కర్లకు ద్రోహం చేసిన కాంగ్రెస్

(మొదటి తరువాయి)


ఇచ్చినట్లు- గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు-, బీమాతో కూడిన సామాజిక భద్రత, సరైన వేతనాలతో పాటు- మరణించిన కార్మికులకు పరిహారం చెల్లింపు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ హామీల అమలు బాధ్యతను తీసుకుంటానన్న రాహుల్ గాంధీ, వీరి సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించిన గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని విమర్శించారు. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తే భారత రాష్ట్ర సమితి పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ తెలిపారు.గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తే బీఆర్‌ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. కేవలం ఓట్ల కోసం హామీలు ఇచ్చి విస్మరించడం కాంగ్రెస్ పార్టీకి అలవా-టైపోయిందని, కాంగ్రెస్ కు చిత్తశుద్ధితో ఉంటే గిగ్ వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గిగ్ కార్మికుల సంక్షేమాన్ని కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, వారి భద్రత, గౌరవం, హక్కులను కాపాడటం ప్రభుత్వ నైతిక, రాజకీయ బాధ్యత అని కేటీ-ఆర్ స్పష్టం చేశారు. 'గిగ్ వర్కర్స్'కు కాంగ్రెస్ తీరని ద్రోహం చేసిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్ అన్నారు. అభయహస్తం డిక్లరేషన్‌లో గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే రేవంత్ సర్కార్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన గిగ్ వర్క్లంల్గ÷న అహ్మద్ బిన్ అబ్దుల్ ఖదర్, శ్యామ్ సుందర్, లొకుర్తి నరేశ్‌లకు ప్రభుత్వం ప్రకటించిన ...5 లక్షల ప్రమాద బీమా పరిహారం ఇప్పటికీ అందలేదని తెలిపారు. వీరి కుటు-ంబాలు అవసరమైన అన్ని పత్రాలను సమర్పించినప్పటికీ పరిహారం అందలేదన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రజలకు సేవలు అందించిన గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ ద్రోహం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన గిగ్ వర్కర్స్ కుటు-ంబాలకు తక్షణమే ...5 లక్షల పరిహారాన్ని చెల్లించడంతో పాటు- గిగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును వెంటనే ఏర్పాటు- చేయాలని డిమాండ్ చేశారు.

# బీజేపీ క్రమంగా బలపడుతోంది

**అన్ని ఎన్నికల్లోనూ విజయం సాధిస్తాం**

**జూబ్లీహిల్స్ ఎన్నికల్లోనూ మనదే విజయం**

**పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**



**హైదరాబాద్,**

తెలంగాణలో బీజేపీ క్రమంగా ఎదుగుతోందని, ఒకప్పుడు గ్రామాల్లో ఒకటి రెండు ఓట్లు వచ్చిన చోట ఇప్పుడు వందల సంఖ్యలో ఓట్లు వస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీని గుర్తించారని, గెలుపు చూస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో వచ్చే అన్ని ఎన్నికలను గెలువడంతో పాటు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించబోతున్నామని భరోసా ఇచ్చారు. మోడీ పాలన, బిజెపి పనితీరు ఇందుకు నిదర్శనమని అన్నారు. రామచందర్ రావు అధ్యక్షతన బీజేపీ ఆఫీస్ బేరర్స్ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇందులో భాగంగా.. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ ఇచ్చారని కాంగ్రెస్, కేసీఆర్ తెచ్చారని బీఆర్ఎస్ చెబుతున్నాయని.. కానీ, పార్లమెంట్‌లో బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వడం వల్లే తెలంగాణ వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. గత పదేళ్లుగా పాలకులు మాటలతో మభ్యపెట్టారని, కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క డిక్లరేషన్ కూడా అమలు కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించాయని, గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయలేకపోతున్నాయని అన్నారు. అలాగే బీసీలను కాంగ్రెస్ మోసం చేసిందని, అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వం విశ్వకర్మ పథకం తెచ్చిందని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు ఇస్తుందని, జీఓ ఇస్తే తాము కూడా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. జీఎస్టీ వల్ల అన్ని వర్గాల ప్రజలకు లాభం చేకూరిందని, నిత్యావసరాలు తక్కువ ధరలకు దొరకడానికి మోడీయే కారణమని చెప్పారు. ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్ వంటి కేంద్ర పథకాలు తెలంగాణలో ప్రజలకు చేరడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి 12 లక్షల కోట్ల రూపాయలు వచ్చాయని తెలిపారు. ఇంకా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లోటు- చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పని చేస్తుందని విమర్శించారు. ఎరువుల కొరత రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా లోపమేనని అన్నారు.


## సంపాదకీయం

# పన్నుల తగ్గింపు.. సంస్కరణ అవుతుందా?

జిఎస్టీ తగ్గింపును సంస్కరణలుగా చెప్పుకుంటూ....ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు. ఇది ఎలా సంస్కరణ అవుతుందో ప్రధాని మోడీ, ఆయనను కీర్తిస్తున్న వారు చెప్పాలి. ప్రజలు కట్టే పన్నులతో అభివృద్ధి చేశామని చెబుతున్న వారు ఎంతగా వంచిస్తున్నారో అర్థం చేసుకోవాలి. ఎంపిలు, ఎమ్మెల్యేల జీతాలు తగ్గిస్తే సంస్కరణ అనుకోవాలి. వారికి పెన్షన్లు తొలగిస్తే అది కూడా ఓ సంస్కరణగా భావించవచ్చు. గవర్నర్ వ్యవస్థను తొలగిస్తే సంస్కరణ అనుకోవాలి. ఆరోవేలుగా ఉన్న శాసనస మండలులను రద్దు చేస్తే అదీ ఓ సంస్కరణ అనుకోవాలి. అలాగే ఎంపిటిసి, జడ్పీటిసిలను రద్దు చేసినా ఓ సంస్కరణగానే గుర్తించాలి. ఇకపోతే ఉచిత పథకాలను రద్దుచేస్తే సంస్కరణలు అనుకోవచ్చు. కానీ ఇవేవీ చేయకుండా 8ఏళ్ల క్రితం జిఎస్టీని తీసుకుని వస్తూ..ఒకే దేశం ఒకే పన్ను అంటూ గొప్పలు చెప్పుకుని ప్రజలను పన్నుల రూపంలో పీల్చి పిప్పి చేశారు. కానీ ఏనాడు తగ్గించమని అడిగినా ససేమిరా అన్నారు. హెల్త్ స్కీమ్‌లు, ఇన్సూరెన్స్‌ల పైన వేసిన జిఎస్టీని తగ్గించమని పార్లమెంట్ వేదికగా కోరితే నిర్ద్వందంగా తిరస్కరించిన ఘనత ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ది. కనీసం ఆలోచిస్తామని కూడా చెప్పలేదు. స్వయంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కోరినా నో చెప్పారు. అలాంటి వారు ఇవాళ ప్రజల్లో వ్యతిరేకత వస్తున్న తరుణంలో జిఎస్టీ స్లాబులను తగ్గించారు. ఇదికేవలం పెంచిన దాంటలో తగ్గింపు మాత్రమే. ఇది సంస్కరణ ఎలా అవుతుందో చెప్పాలి. మోడీని సమర్థిస్తూ..నిత్యం కీర్తిస్తున్న చంద్రబాబు సైతం గొప్ప ఆర్థిక సంస్కరణగా చెప్పుకోవడం, అసెంబ్లీలో తీర్మానం చేయడం విడ్డూరం కాక మరోటి కాదు. ఉమ్మడి ఎపిలో బియ్యం ధరలను పెంచిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు పెంచడం లేదో చెప్పాలి. ఏళ్ల తరబడి ప్రజలను పీల్చి పిప్పి చేసిన అనంతరం వస్తు సేవల పన్ను విధానంలో కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా తీసుకువచ్చిన మార్పుల తీరు చూస్తుంటే ఎంతగా రాజకీయ చతురత చూపాలనుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ చర్యతో భారీ మొత్తంలో పన్నులు తగ్గాయని, సామాన్యులు పండగ చేసుకోవచ్చని పాలకులు చెబుతున్న ప్పటికీ వాటి ఫలితాలు సామాన్యులకు అందడంపై సందేహాలు నెలకొన్నాయి. అయినా ఇంతకాలం ఎందుకు పండగ చేసుకోనీయలేదన్న ప్రశ్నలకుకూడా సమాధానం రావాలి. ఈ నెల 22వ తేదీ నుండి నూతన జిఎస్‌టి విధానం అమలులోకి రాగా, ఒక రోజు ముందు దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దసరా, దీపావళి పండగ సీజన్‌ను 'జిఎస్‌టి సేవింగ్స్ ఫెస్టివల్'గా అభివర్ణించడం మసిపూసి మారేడు కాయ చేయడం అంటారు. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోడీని అభినందిస్తూ అసెంబ్లీ ఉభయ సభల్లోనూ తీర్మానాలు చేసింది. శాసనసభలో జిఎస్‌టి 2.0 వల్ల కలిగే ప్రయోజనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘ ప్రసంగం చేశారు. అయితే, ప్రధాని నరేంద్రమోడీగానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గానీ ఇన్ని సంవత్సరాల పాటు ప్రజలపై మోపిన భారాన్ని గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం. అలాగే ఒక కుటుంబానికి కలిగే ప్రయోజనం ఎంతో కూడా వారు చెప్పలేదు. నిజానికి, ఏ వస్తువుపై ఎంత ధర తగ్గుతుందన్న నిర్దిష్టమైన వివరాలను కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెల్లడించడంలేదు. ఇప్పటికీ షాపుల వారు మాత్రం పాత ధరలనే అమ్ముతున్నారు. జిఎస్టీ మార్పులపై ప్రకటన చేయడం లేదు. టీవీ షోరూమ్‌లు, కార్ల షోరూమ్‌లలో మాత్రం కొంత హడావిడి కనిపిస్తోంది. ఏకీకృత పన్ను విధానం పేరుతో కార్పొరేట్ల ప్రయోజనాల కోసం జిఎస్‌టిని 2017లో దేశంపై నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం రుద్దింది. దశాబ్దాలుగా అనుసరించిన ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా సామాన్యుడి కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గింది. జిఎస్‌టిలో ఉన్న సంక్లిష్టత, అపరిమిత శ్లాబుల కారణంగా నిత్యావసర ధరలు భారీగా పెరిగి దేశ వ్యాప్తంగా గగ్గోలు చెరేగింది. ప్రతిపక్షాలు దీనిని గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌గా అభివర్ణించాయి. మరోవైపు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతపడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా తగ్గాయి. అదే సమయంలో ట్రంప్ టారిఫ్‌ల ప్రభావమూ పడింది. దీంతో ప్రజల ప్రయోజనాలు ఎలా ఉన్నప్పటికీ కార్పొరేట్ల కోసమైనా దేశీయ మార్కెట్‌ను పెంచడం కోసం జిఎస్‌టిని తగ్గించక తప్పనిస్థితి ఏర్పడింది. వారికి లాభం చేకూర్చా లంటే జిఎస్టీ తగ్గించాలన్న పరిస్థితి ఎదురయ్యింది. దీనికితోడు చుట్టుపక్కల దేశాల్లో ప్రజల్లో అసహనం పెల్లుబికింది. ఇవన్నీ గమనించిన ఏలినవారు జిఎస్టీ తగ్గించడం తప్పదని గుర్తించారు. కార్పోరేట్లు కూడా ధరల తగ్గింపు గురించి ఇచ్చిన సూచనలు పాటించారని అర్థం అవుతోంది. అదే సమయంలో ధరలను నేరుగా తగ్గించే అవకాశాలను మాత్రం పరిశీలించడం లేదు. స్టీలు, సిమెంట్, ఔషధాల ధరలను తగ్గించడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 55 లక్షల కోట్ల రూపాయలను గత ఏడు సంవత్సరాల్లో జిఎస్‌టి ద్వారా ప్రజల మూలుగలు పిండి మోడీ సర్కారు వసూలు చేసింది. దేశంలో కోట్లాది మందికి ఉపాధి కల్పించే చేనేత రంగానికి అవసరమయ్యే ముడి సరుకులను అదే శ్లాబులో ఉంచారు. కొన్ని రకాల ఔషధాలను జీరో శ్లాబులో ఉంచినట్లు- చెబుతున్నప్పటికి, వాటి తయారీకవసరమైన ముడి పదార్థాలపై పన్ను విధించారు. జిఎస్‌టి అమలులోకి వచ్చిన 24 గంటల తరువాత కూడా పాలతో పాటు- నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదు. పాత స్టాక్‌కు తగ్గింపు వర్తించదని అంటున్నారు. పలు సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను కొద్ది రోజుల కిందటే పెంచాయి. వీటిపై జిఎస్‌టిని తగ్గించినా,పెద్దగా ఫలితం కనిపించడంలేదు. సామాన్యుడికి ప్రయోజనం కలిగించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం ఉన్నా జిఎస్‌టి రేట్ల తగ్గింపు వివరాలను నిర్దిష్టంగా సరుకుల వారీగా ప్రకటించాలి. అలాగే కరోనా తరవాత ఇబ్బడిముబ్బడిగా పెంచిన ఔషధాల ధరలను తగ్గించాలి. రాజకీయనాయకులు జీతభత్యాలను వెంటనే తగ్గించాలి. రాజకీయ నాయకులకు పెన్షన్లు ఎత్తేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. అప్పుడే దేశీయ ఉత్పత్తులకు, ఎంఎస్‌ఎంఇలకు ఊతం లభిస్తుంది.

# ఫిబ్రవరి 17 నుంచి సీబీఎస్ఈ పరీక్షలు

**తొలిసారిగా ఏడాదికి రెండుసార్లు పదో తరగతి పరీక్షల నిర్వహణ**
**ఫిబ్రవరి 17 నుంచి మార్చి 6 వరకు తొలి విడత**
**మే 15 నుంచి జూన్ 1 వరకు రెండో విడత పరీక్ష**
**ఫిబ్రవరి 17 -ఏప్రిల్ 9 వరకు 12వ తరగతి ఎగ్జామ్స్**



**న్యూఢిల్లీ, -ప్రజా స్వేచ్ఛ**

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10, 12 తరగతి బోర్డు పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి నిర్వహించనున్నట్టు అధికారులు బుధవారం ప్రకటించారు. ఈ పరీక్షలకు బోర్డు తాత్కాలిక డేట్ షీట్‌ను ప్రకటించింది. 10వ తరగతి బోర్డు పరీక్షలు ఏడాదికి రెండుసార్లు నిర్వహించనుండటం ఇదే మొదటిసారి.ఇందులో భాగంగా మొదటి విడత పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 నుంచి మార్చి 6 వరకు, రెండో విడత బోర్డు పరీక్షలు మే 15 నుంచి జూన్ 1 వరకు జరుగుతాయని సీబీఎస్ఈ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యం భరద్వాజ్ వివరించారు. అయితే రెండో విడత పరీక్షలకు విద్యార్థి హాజరవ్వడం ఐచ్ఛికమని, మొదటి విడత కన్నా మెరుగైన మార్కుల కోసం విద్యార్థి రెండో దానికి కూడా హాజరు కావచ్చునని, రెండింటిలో ఆయా సబ్జెక్టులలో ఏ విడతలో ఎక్కువ మార్కులు వస్తాయో వాటినే పరిగణనలోకి తీసుకోనున్నట్టు చెప్పారు.రెండింటికీ సిలబస్, పరీక్షా విధానం ఒకే విధంగా ఉంటాయన్నారు. అలాగే 10వ తరగతికి ఎలాంటి సప్లిమెంటరీ పరీక్షా విధానం ఉండదని తెలిపారు. రెండో విడత పరీక్షే సప్లిమెంటరీ కింద పనిచేస్తుందని ఆయన వివరించారు.కాగా, 12వ తరగతి బోర్డు పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి ఏప్రిల్ 9 వరకు జరుగుతాయన్నారు.

# 71 మంది నక్సల్స్ లొంగుబాటు

**వీరిలో 30 మందిపై రూ.64 లక్షల రివార్డు**
**జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు నక్సల్స్ మృతి**




**కొత్తగూడెం -ప్రజా స్వేచ్ఛ**

పార్టీ సిద్ధాంతాలు నచ్చకపోవడంతో 71 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. వివరాలను దంతేవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ బుధవారం వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో 21 మంది మహిళా సభ్యులు ఉన్నారు. 30 మంది పై రూ.64 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 1,113 మంది మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు లొంగిపోగా.. వారిలో 297 మం దిపై రివార్డులు ఉన్నట్లు పేర్కొన్నారు.**ముగ్గురు నక్సల్స్ ఎన్‌కౌంటర్**

భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో జార?ండ్ రాష్ట్రం గుల్మా జిల్లాలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. గుల్మా జిల్లాలోని కేచ్‌కీ అటవీ ప్రాంతంలో జాగ్వార్, గుల్మా పోలీసులు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులకు దిగారు. దీంతో భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మృతులు జార?ండ్ జన్‌ముక్తి పరిషత్ (జేజేఎంపీ)కి చెందిన సభ్యులు లాలు లోహ్రా, సుజిత్ ఓరాన్ (లోహర్‌గడ జిల్లా), చోటూ ఓరన్ (లాతేహర్ జిల్లా)లుగా పోలీసులు గుర్తించారు.

# నూతన హైకోర్టు భవన నిర్మాణానికి వంద ఎకరాల భూమి..





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్
నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## పరిశీలించిన హైకోర్టు సీజే

**హైదరాబాద్,-ప్రజా స్వేచ్ఛ**


రాజేంద్రనగర్‌లో నూతన హైకోర్టు భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన వంద ఎకరాల భూమిని హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి, ఏజీ సుదర్శన్‌రెడ్డి తదితరులతో కలిసి సీజే ఉన్నారు. నూతన హైకోర్టు భవన నిర్మాణంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న వంద ఎకరాల భూమిని ప్రభుత్వం హైకోర్టుకు కేటాయించింది. ఈ భూమిని సందర్శించిన చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, ఇతర న్యాయమూర్తులు భూమి ప్రస్తుత పరిస్థితి, భవన నిర్మాణానికి అనువుగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. ఈ భూమికి సంబంధించి పూర్తి వివరాలు, మ్యాప్‌లను అధికారులు వారికి అందజేశారు. ఈ భూమిలో భవన నిర్మాణం చేపట్టడం వల్ల ప్రయాణ సౌకర్యాలు, వసతులు వంటి అంశాలను కూడా వారు పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ, నూతన హైకోర్టు భవన నిర్మాణం వల్ల న్యాయవాదులకు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని, తద్వారా న్యాయవ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రస్తుత హైకోర్టు భవనం చారిత్రకమైనది అయినప్పటికీ, అందులో స్థలం సరిపోవడం లేదు. రోజురోజుకు పెరుగుతున్న న్యాయ కేసుల సంఖ్య, న్యాయవాదులు, సిబ్బంది సంఖ్యకు అనుగుణంగా కొత్త భవనం అవసరమని గతంలోనే చాలా సార్లు ప్రతిపాదనలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త భవన నిర్మాణానికి భూమి కేటాయించడం, హైకోర్టు న్యాయమూర్తులు దానిని పరిశీలించడం ఒక శుభపరిణామంగా భావిస్తున్నారు. కొత్త భవనం నిర్మాణం పూర్తి అయితే, అది ప్రజలకు, న్యాయవాదులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఆధునిక సదుపాయాలతో ఉంటుందని ఆశిస్తున్నారు.

# జీవో కోసం ఎదురుచూపులు

## 42 శాతం రిజర్వేషన్ల ఖరారుపై స్పష్టత రాగానే స్థానికంపై ముందుకు

- ప్రభుత్వానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డులపై రిజర్వేషన్ల నివేదిక
- డీఈఓల నుంచి టీచర్ల డేటా తీసుకున్న కలెక్టర్లు
- 26న రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ







తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ
స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం వడివడిగా సన్నద్ధమవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ జీవో జారీ చేసిన వెంటనే ముందుకెళ్లాలనే ఆలోచనలతో అన్నింటినీ సిద్ధం చేసుకుంటున్నది. అయితే, ప్రభుత్వం నుంచి జీవో ఎప్పుడు విడుదలవుతుందనే దానిపైనే స్పష్టత రావాల్సి ఉంది. ఈ విషయంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండాలంటే ఎలా ముందుకెళ్లాలనే విషయంలో రాష్ట్ర సర్కారు తర్జనభర్జన పడుతున్నది. మరోవైపు ఎన్నికల అధికారులు జడ్పీటీసీ, జడ్పీ చైర్మెన్, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియను ఖరారు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను కలెక్టర్లు ప్రభుత్వానికి అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజర్వేషన్ల వివరాలను గోప్యంగా ఉంచారు. బీసీ కులగణన సర్వే ఆధారంగా 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసినట్టు తెలిసింది. మహిళా రిజర్వేషన్ల కోసం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో లాటరీ నిర్వహించనున్నారు. రిజర్వేషన్ల శాతంపై జీవో జారీ చేశాకే వాటి వివరాలను ప్రభుత్వం ప్రకటించనున్నది. రాష్ట్రంలో 5773 ఎంపీటీసీ స్థానాలు, 566 జెడ్పీటీసీ స్థానాలు, 566 ఎంపీటీసీ స్థానాలున్నాయి. 31 జడ్పీ స్థానాలు, గ్రామపంచాయతీలు 12,777, వార్డులు 1,12,694 ఉన్నాయి. అందులో 2450 ఎంపీటీసీ స్థానాలు, 238 ఎంపీపీ, 238 జెడ్పీటీసీ స్థానాలు, 5363 గ్రామపంచాయతీలు, 47270 వరకు వార్డు స్థానాలు బీసీలకు కేటాయించినట్లు సమాచారం.

అయితే, ప్రభుత్వం మాత్రం దీన్ని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

26న ఆర్వో, ఏఆర్వో, పీఓలకు శిక్షణ

ఎన్నికల నిర్వహణకోసం డీఈఓల నుంచి టీచర్లకు సంబంధించిన డేటాను కలెక్టర్లు తీసుకున్నారు. గెజిటెడ్, స్కూల్ అసిస్టెంట్లకు, ఇతర స్టాఫ్ చేపట్టాల్సిన విధులపై వివరాలు డీఈవోలు అందజేశారు. దాని ఆధారంగా త్వరలో అధికారిక ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. సీనియార్టీ ప్రకారం ఎవరికి బాధ్యతలు కేటాయించాలనే అంశంపై కసరత్తు జరుగుతున్నది. ఎప్పుడు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని పంచాయతీరాజ్ శాఖ ప్రకటించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి(ఏఆర్ఓ)లకు కలెక్టర్లు ఈ నెల 26న శిక్షణ నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం విడుదల చేశారు. అదే విధంగా మండలాల వారీగా పోలింగ్ ఆఫీసర్లు(పీఓ), ఏపీఓ, ఓపీఓలకు సైతం శిక్షణ నిర్వహిస్తున్నట్లు, అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కలెక్టర్లు ప్రకటించారు. ఆయా మండలాల అధికారులకు బుధవారం ఉత్తర్వులు అందజేశారు.

**తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీనే..**

ప్రభుత్వం రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నది. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నది. ఆ తర్వాతనే సర్పంచి ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో రాష్ట్ర సర్కారు ఉంది. అందుకే మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై ఆర్ఓలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిసింది.

## తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్ టి సి నూతనంగా ప్రవేశపెట్టిన యాత్రా

పబ్లిసిటీ కార్యక్రమంలో భాగంగా పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బస్ డిపో మేనేజర్ శ్రీనాథ్ గౌడ్, పటాన్చెరు ఆర్ టి సి బస్టాండ్ స్టేషన్ మాస్టర్ మహమ్మద్ ఇసాక్ తదితరులు తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ప్రవేశపెట్టిన యాత్రా దానం కార్యక్రమం గురించి ప్రజలకు తెలియజేయజేయాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బస్ డిపో మేనేజర్ శ్రీనాథ్ గౌడ్, పటాన్చెరు ఆర్ టి సి బస్టాండ్ స్టేషన్ మాస్టర్ మహమ్మద్ పలువురు ఆర్ టి సి అధికారులు ఈ రోజు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ని కలిసి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణలో ఆర్టీసీ బస్సుల ద్వారా అనాథలు, పేదలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రయాణాన్ని బహుమతిగా ఇచ్చే పథకమే యాత్రాదానం ఈ పథకం కింద దాతలు తమకు నచ్చినవారికి లేదా ఆర్టీసీ సూచించిన లబ్ధిదారులకు బస్సు ప్రయాణాన్ని స్పాన్సర్ చేయవచ్చు, దీని ద్వారా వారికి దేవాలయాలు లేదా పర్యాటక స్థలాలకు వెళ్ళడానికి సహాయపడుతుందని తెలిపారు.

## గంజాయి మొక్క పెంచిన వ్యక్తిపై కేసు నమోదు

నారాయణఖేడ్ ప్రజా స్వేచ్ఛ
తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కను పెంచుతున్న పెంచుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కంగ్టి సిఐ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ..కల్హేర్ మండలంలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన చిన్న నేమిల మల్లేశం తండ్రి సంగయ్య తన ఇంటి ఆవరణలో ఎవరూ గుర్తు పట్టకుండా గంజాయి మొక్కను పెంచుతున్నాడన్న రహస్య సమాచారం మేరకు ఎస్సై మధుసూదన్ రెడ్డి మరియు సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేయగా ఒక గంజాయి మొక్క లభించిందని,మండల పరిధిలో ఎవరైనా, ఎక్కడైనా గంజాయి సాగుచేసిన కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాము హెచ్చరించారు.


## నానబెట్టిన బియ్యం బతుకమ్మ ఆహ్లాదకర వాతావరణంలో బతుకమ్మ సంబరాలు



ప్రజా స్వేచ్ఛ సంగారెడ్డి ప్రతినిధి
పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల గీతాలు, గౌరమ్మ పూజలు సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని , ప్రతి ఒక్కరూ పండుగను ఆనందంగా, ఐకమత్యంతో జరుపుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి అన్నారు నానబెట్టిన బియ్యం బతుకమ్మ పండుగను సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భముగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ,జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులు సంక్షేమ శాఖల సిబ్బంది రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను ఉంచి, ఆడి, పాడి ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా, ఆహ్లాదకర వాతావరణంలో నానబెట్టిన బియ్యం బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం జరిగిందన్నారు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా బతుకమ్మ పండుగ పెద్దల అమావాస్య తరువాతి రోజు నుంచి ప్రారంభమై తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతుందన్నారు . పల్లెలు పట్టణాల్లో ఎక్కడ చూసినా తెలంగాణా సాంస్కృతిక పండుగ వాతావరణం కనిపిస్తుందన్నారు సృష్టిస్తుంది ఈ వేడుకలలో జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారి జగదీష్, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి, ఈ డిఎస్సీ కార్పొరేషన్ రామాచారి, ఇతర సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థులు,చిల్డ్రన్స్ హోమ్ పిల్లలు ,మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వివాహా నిశ్చతార్థ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన

-సింగిరెడ్డి వసంతి,సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాజీ మంత్రి దంపతులు



ప్రజా స్వేచ్ఛ .వనపర్తి జిల్లా ప్రతినిధి.
మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో, ఓం కన్వెన్షన్ లో వనపర్తి వాస్తవ్యులు మాజీ కౌన్సిలర్ వసంత ఎర్రశ్రీను కుమారుడు ఇరిగేషన్ ఎఈఈ, శివకుమార్ వాల్మీకి ఎంగేజ్మెంట్ లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, సింగిరెడ్డి వాసంతి. మాజీ మంత్రి వెంట బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు నీల స్వామి, మాజీ కౌన్సిలర్ ఉంగుళం తిరుమల్,సోషల్ మీడియా అధ్యక్షులు సునీల్ వాల్మీకి, జనార్దన్,బాలరాజు,ప్రశాంత్ వాల్మీకి,జస్వంత్,జీప్ రమేష్, మన్నెం,ముఖ్యులు పాల్గొన్నారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి


-యాక్సిస్ బ్యాంక్ ఓపెనింగ్ కి ముఖ్య అతిథిగా
-అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి



ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి
వేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో నూతన బ్యాంకులు ఏర్పాటు కావడం సంతోషకరమని.. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. అమీన్పూర్ లో యాక్సిస్ బ్యాంక్ నూతనంగా ఏర్పాటుచేసిన బ్యాంకు శాఖను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, బిజిలి రాజు,సీనియర్ నాయకులు, నందారం రమేష్ గౌడ్, చౌటకూరి మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి



ప్రజా స్వేచ్ఛ వలిగొండ ( ప్రతినిధి)
మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన ఎర్ర కమలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి మృతురాలి కుమారుడు ఎర్రగుట్ట కు 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహా యాదవ్, తాజా మాజీ ఉపసర్పంచ్ సుక్క ముత్యాలు, శ్రీ మత్స్యగిరి గుట్ట ధర్మకర్త కొడితాల కర్ణాకర్, దామెర అంజయ్య, బుర్ర మల్లేష్, కొప్పుల బాలరాజు, జినుకల మల్లయ్య, లోతుకుంట రాములు, నల్ల రాములు, వెలిమినేటి పెంటయ్య, రెబ్బాస్ నరేష్, జినుకల నారాయణ, నల్ల రామచందర్, కొప్పుల దాసు, ఎండి దస్తగిరి, శివరాత్రి యాదయ్య, బత్తిని నరసింహ, బైకానీ బిక్షం, బద్దం భీమార్జున్ రెడ్డి, జినుకల నరసింహ, ఎర్ర సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో దేవి నవరాత్రి ఉత్సవాలు

**భవాని దీక్షతో ముక్తి మార్గం**



**ప్రజా స్వేచ్ఛ బైంసా ప్రతినిధి**

దేవి నవరాత్రి ఉత్సవాలు బైంసా పట్టణంతో పాటు వివిధ మండలాల్లో భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి.నవరాత్రుల సందర్భంగా మహిళలు తమ గృహాల్లో అమ్మవారిని ప్రతిష్టాపించి భవాని దీక్షలను స్వీకరించి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు,అమ్మవారు ప్రతిరోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో మండపాల్లో ప్రతిష్టించిన అమ్మవారి వద్ద వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడుతుంది. మహిళలు-యువకులు నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భవాని దీక్షను చేపట్టారు.నియమ నిష్ఠలతో దీక్షను పూర్తి చేస్తే అమ్మవారి కరుణాకటాక్షం ఎల్లవేళలా ఉంటుందని పేర్కొన్నారు.సాయంత్రం సమయాల్లో భక్తుల సౌకర్యార్థం మండపాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.రాత్రి సమయాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా నవరాత్రి ఉత్సవాల సందడి కనిపిస్తుంది.నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును నిర్వహిస్తున్నారు.

## డాక్టర్.జిల్లెల.చిన్నారెడ్డి ప్రత్యేక చోరవతో 12 సం,,సమస్యకు పరిష్కారం



**ప్రజా స్వేచ్ఛ /వనపర్తి జిల్లా ప్రతినిధి.**

వనపర్తి జిల్లా,శ్రీరంగాపూర్ మండలం,నాగరాల గ్రామానికి చెందిన గుంటి బాలక్రిష్ణ నివాస స్థల పట్టా కోసం 12 సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగిన నివాసస్థల పట్టా ఇవ్వలేదు. గ్రామ నాయకులు ఎవరూ సహకరించలేదు. ప్రభుత్వ కార్యాలయల చుట్టూ తిరగడం తప్ప సమస్యను ప్రభుత్వ అధికారులు పరిష్కరించిన దాఖలాలు లేవు అని తెలిపారు.ఆఖరి ప్రయత్నం గా మహాత్మ జ్యోతిబాపూలే ప్రజాభవన్ లో ప్రజావాణి లో తన సమస్యను తెలుపగా ప్రజావాణి ఇంచార్జ్ , రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి.చిన్నారెడ్డి ప్రత్యేక చొరవతో గుంటి బాలక్రిష్ణ నివాస స్థల పట్టా ఇవ్వడం జరిగింది.గుంటి బాలక్రిష్ణ తన 12 ఏళ్ల సమస్య పరిష్కారం అయినా సందర్భంగా గుంటి బాలక్రిష్ణ డా.జి.చిన్నారెడ్డి ని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.రాజశేఖర్ రెడ్డి మాజీ జడ్పీటీసీ ఆదేశాలతో మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**చంద్రయ్య సాగర్ మాజీ ఎంపిటిసి**




**అడ్డాకుల ప్రజా స్వేచ్ఛ**

అడ్డాకుల మండల పరిధి పెద్దమునగ చెడు గ్రామ వాస్తవ్యులు కీ "శే "తెలుగు ఆంజనేయులు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడతూ నిన్న రాత్రి స్వర్గస్తులైనారు.గ్రామ స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న అడ్డాకుల మండల మాజీ జెడ్పిటిసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, ఆయన మృతికి సంతాపం తెలుపుతూ స్థానిక నాయకుల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు రూ,5000 ఆర్థిక సహాయం అందించడం జరిగింది.స్థానిక బిఆర్ఎస్ నాయకులు మృతుని స్వగృహానికి వెళ్లి కీ "శే " తెలుగు ఆంజనేయులు భౌతిక దేహాన్నీ సందర్శించి, నివాళులర్పించారు బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.

అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు నివాళులర్పించిన వారిలో పెద్ద మునగాల చెడు గ్రామ మాజీ ఎంపీటీసీ చంద్రయ్య సాగర్, వెంకటేష్ యాదవ్, చుక్క రవి,గుగ్గిళ్ళ సత్యనారాయణ, గ్రామ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# తప్పుడు హామీలతో రైతులను మోసం చేస్తున్న అధికార కాంగ్రెస్

**రాళ్ళ కృష్ణయ్య బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు ఘనపూర్**

**ప్రజా స్వేచ్ఛ ఘనపూర్/వనపర్తి జిల్లా ప్రతినిధి.**

వనపర్తి జిల్లా,ఘనపూర్ మండల కేంద్రంలోని, గణపసముద్రం చెరువు దాదాపు 35 సంవత్సరాలు ఎలాంటి నీటి వసతులు లేక నర్రెలు బారిన చెరువును,2017లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా ఉన్న సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,చెరువుకు నీటి వసతులు,ప్రభుత్వపరంగా ఎలాంటి నీటి కేటాయింపులు లేకపోయినా,ఆనాటి సీఎం కేసీఆర్ తో,ఒప్పించి కే.ఎల్.ఐ నీటి కేటాయింపు పెంచి అందులో నుంచి మంగనూరు నుంచి గణపసముద్రం కు,నీళ్లు మళ్లించి ఘనపసముద్రం అలుగు పారించడం జరిగిందని ఘనపూర్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాళ్ళ కృష్ణయ్య అన్నారు.ఈ సందర్భంగా రాళ్ళ కృష్ణయ్య మాట్లాడుతూ,చెరువు వెనుక గల ఎన్నో ఏళ




్లగా సాగునీరు లేక కంపచెట్లతో నిండిపోయిన పొలాలన్నింటిని పచ్చని పైరులుగా మార్చడం జరిగింది.ఆనాటి మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తో రైతులు తెలుపగా, అట్టి రైతులను ఆదుకోవడానికి ఎలాంటి వసతులు లేకపోవడంతో గడప సముద్రం చెరువును రిజర్వాయర్ గా మార్చడం జరిగింది. రైతుల విజ్ఞాపన మేరకు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి 20:7: 23 రోజున కొత్త జీవో ద్వారా 12 లక్షలకు పైగా ఎకరాకు చెల్లించే విధంగా, ఆనాడు జీవోను తేవడం జరిగింది.అది గమనించిన కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో భాగంగా మోసపూరిత హామీలతో ఎకరాకు 20 నుంచి 25 లక్షలు ఇస్తామని ఘనపురం బస్టాండు దగ్గర కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉన్న టి.మేగారెడ్డి హామీ ఇవ్వడం జరిగింది.మేఘారెడ్డి ఓట్లు వేసిన గణపసముద్రం రైతులకు ఒక న్యాయం,కొడంగల్ లో రేవంత్ రెడ్డికి ఓట్లు వేసినా రైతులకు ఒక న్యాయమా..?? అంటూ బాధపడుతున్న ముంపు రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంటుందని ఘనపూర్ డిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాధాకృష్ణయ్య తెలిపారు.

# ల్యాండ్ మాఫియా గ్యాంగ్ ఆక్రమణల నుండి నా భూమినీ కాపాడండి






**సయ్యద్ మీర్**

**ప్రజా స్వేచ్ఛ**
**శేరిలింగంపల్లి ప్రతినిధి**

హఫీజ్‌పేట గ్రామం శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లాలోని సర్వే నెం. 78 వద్ద గోల్డ్ స్టోన్ ప్రసాద్ కీ చెందిన సైరస్ ఇన్వెస్ట్ మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ముంబయి, సవేరా కన్స్ట్రక్షన్ కంపెనీ నుండి క్రాఫ్ట్ అల్లో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కొనుగోలు చేసినట్టు నకిలీ పత్రాలు సృష్టించి. ల్యాండ్ మాఫియా గ్యాంగ్ సభ్యులు వేదాం అగర్వాల్, గోపాల కృష్ణ అక్రమంగ 20 అనుచరులతో జె సి బి తో టిప్పర్ వ్యాన్ లతో స్టేటస్కో ఉన్న భూమిలో కీ దౌర్జన్యం తో చొరబడి చదును చేసి, చెట్ల ను నరికేసే కార్యక్రమం లను చేపట్టారు అని సయ్యద్ మీర్ అనే వృద్ధుడు మంగళ వారం ఈ వాట్సాప్ ద్వారా ఫిర్యాదును సైబరాబాద్ కమిషనరేట్ కు ఏ సీ పి, ఎమ్మార్వో, ఆర్డీవో, కలెక్టర్ ల కి పిర్యాదు చేశారు. దాదాపు 3.00 ఎకరాల భూమి కి సంబంధించిన అన్ని పార్టీలు స్టేటస్ కో నిర్వహించాలని ఆదేశించినప్పటికీ, భారత సుప్రీంకోర్టు సివిల్ అప్పీల్.నం. 1797 ఆఫ్ 2023లో ఆదేశించింది. సర్వే నంబర్ 77 నుండి 80 హఫీజ్‌పేట గ్రామానికి సంబంధించి బ్యాచ్, రాష్ట్ర ప్రభుత్వం కూడా స్టేటస్ కో ఆర్డర్ ప్రభావంపై మెమో జారీ చేయడం ద్వారా స్టేటస్ కో ఆర్డర్‌ను ధృవీకరించింది. కొంతమంది మూడవ పార్టీలు నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమ హక్కుదారుల ఆధారంగా మా ఆస్తిని ఆక్రమించడానికి దౌర్జన్యం తో కొంత మంది బౌన్సర్ లను వెంటేసుకుని జేసిబి తో చదును చేస్తూ ప్రయత్నిస్తున్నారు. మేము చాలా కాలంగా నైతికంగా ఆస్తిని కలిగి ఉన్నాము. ఇటీవల గౌరవనీయులైన సుప్రీంకోర్టు ఎస్ ఎల్ పి.నం. 2373-2377 ఆఫ్ 2020 , బ్యాచ్ తేదీ: 15-06-2023లో మూడవ పార్టీల వాదనలను తోసిపుచ్చింది (పారా.నం. 195) మరియు 2017 యొక్క ఎ.ఎస్.నంబర్.196 లోని అప్పీలేట్ కోర్టు కూడా సైరస్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముంబై ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఆరోపించిన పత్రాన్ని పక్కన పెట్టింది, దానిని చెల్లనిదిగా నిర్ధారించింది తేదీ 02-12-2023 హాఫీజ్ పేట్ 2011లో సర్వే నెం. 78 హఫీజ్‌పేట్ గ్రామంలోని సబ్జెక్ట్ భూమిపై ఇలాంటి పరిస్థితి తలెత్తింది. మేము సి ఆర్ ఎల్ పి.నంబర్.3225 అఫిడవిట్ 2011ని దాఖలు చేసాము. హైకోర్టు రెండు పార్టీలను మియాపూర్ పోలీస్ స్టేషన్ ముందు హాజరు కావాలని ఆదేశించింది, వారి వాదనలకు సంబంధించి రెండు పార్టీల పత్రాలను ధృవీకరించడానికి , మూడవ పార్టీలు ఎప్పుడూ పోలీస్ స్టేషన్‌కు రాలేదు మరియు అప్పటి నుండి మేము భూమిని స్వాధీనం చేసుకున్నాము. కాబట్టి ఎస్ హెచ్ వో మియాపూర్‌ను మా సర్వే నంబర్ నెం.78 హఫీజ్‌పేట్ విలేజ్ లోని దాదాపు 3 ఎకరాల ఆస్తిలో అక్రమంగా ప్రవేశించినందుకు అక్రమ హక్కుదారులపై ఎఫ్ ఐ ఆర్ ను నమోదు చేయమని అభ్యర్థించండము అయినది కోర్టు ఆదేశాల ప్రకారం మేము ఆస్తిని స్వాధీనం చేసుకున్నాము, మేము ఆ ఆస్తిపై పోలీసు రక్షణను కూడా పొందాము, 2010 తేదీ 14-04-2011న సి ఆర్ ఎల్ పి.నంబర్.3225లోని హైకోర్టు కోర్టు ఆదేశాల ప్రకారం ప్రధాన లింక్ పత్రాలను, ముఖ్యంగా ఆరోపించిన మూడవ పక్షాల లింక్ పత్రాలను ధృవీకరించమనీ ఎస్ హెచ్ వో మియాపూర్ ను ఆదేశించారు. అందువల్ల సైబరాబాద్ కమిషనరేట్ కు సయ్యద్ మీర్ తండ్రి పేరు అబ్దుల్ రెహమాన్ ఈ వాట్సాప్ ఫిర్యాదును అందించామని విలేఖరుల సమావేశంలో తెలిపారు. సయ్యద్ మీర్ మాట్లడుతూ ప్రతివాదుల నుండి మా భూమి నీ, మా ప్రాణాలని కూడా రక్షించాలి అని మియాపూర్ సీఐ కీ సమాచారం అందించి వారిని కలవడం కూడా జరిగింది అని సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు.

## శ్రీమంతం కార్యక్రమానికి హాజరైన తడక జగదీశ్వర్ గుప్తా,కుటుంబ సభ్యులు



**ప్రజా స్వేచ్ఛ**
**కామారెడ్డి ప్రతినిధి**



కామారెడ్డి లోనే ప్రముఖ వ్యాపారవేత్త త్యార్ల.వనజ వెంకట్రాములు కుమారుడు సాయి చరణ్ (సుప్రియల) ల శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించిన వైఎస్ఆర్సిపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మరియు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా రుక్మిణి దంపతులు గుప్త కూతురు గుండా అనిత,నల్ల ప్రసాద్, గజవాడ బాలకిషన్,బూర్ల శంకర్,సంతపురం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు

## ఆర్ జి కె దుర్గామాత ప్రత్యేక పూజలో పాల్గొన్న సామల సందీప్ రెడ్డి

**ప్రజా స్వేచ్ఛ**
**ఘట్కేసర్ ప్రతినిధి**



మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత నవరాత్రుల ఉత్సవాలు భాగంగా మూడవరోజు అన్నపూర్ణేశ్వరి మాతగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు అమ్మవారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామల సందీప్ రెడ్డి పాల్గొని దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో భాగంగా ఆదర్శ్ యూత్ నెలకొల్పిన దుర్గామాతను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆ అన్నపూర్ణేశ్వరి మాతను కోరుకున్నానని ఆయన అన్నారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమంలో పోచారం మున్సిపాలిటీ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆదర్శ యూత్ అధ్యక్షులు శివ చౌదరి కమిటీ సభ్యులు వరికుప్పల బాబురావు బోధస్ సురేష్ నాగరాజ్ గౌడ్ శివకుమార్ నాయక్ శ్రీను యాదవ్ ఆర్య రాజు శ్రీధర్ రెడ్డి హేండిగా మధు అనిల్ యాది ముదిరాజ్ సతీష్ మధు జలంధర్ సతీష్ కిరణ్ రెడ్డి దుర్గా పటేల్ సాయి చందు అమీర్ వినయ్ శివ గౌడ్ శ్రావణ్ పయ్యావుల సతీష్ తిరుమలేష్ బ్లెస్లరీ ప్రసాద్ రఘు రాహుల్ రమ్మీ సాంబ సోను విజయవర్మ వంశీలతోపాటు కాలనీవాసులు భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజినెస్

## తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24
: గత కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. అమెరికా ఫెడరల్ చైర్మన్ జెరోమ్ పోవెల్ వడ్డీరేట్లను తగ్గించాల్సివుంటుందని హెచ్చరికల నేపథ్యంలో ట్రేడర్లు ప్రాఫిట్‌కు మొగ్గుచూపారు. ఫలితంగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన పుత్తడి ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.900 తగ్గి రూ.1,18,000గా నమోదైంది.అంతకుముందు ధర రూ.1,18, 900గా నమోదైంది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర అంతే స్థాయిలో తగ్గి రూ.1,17,400కి పరిమితమైంది. మంగళవారం రికార్డు స్థాయిలో రూ.2,650 ఎగబాకిన విషయం తెలిసిందే. బంగారంతోపాటు వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.600 తగ్గి రూ.1,39,600కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,760.36 డాలర్లకు, వెండి 43.87 డాలర్లకు తగ్గాయి.

## అమెరికాకు 58శాతం తగ్గిన భారత స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు..!



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24
భారత నుంచి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలను భారీగా పెంచిన విషయం తెలిసిందే. ఈ సుంకాల ప్రభావం భారత్‌లో తయారైన వస్తువులపై ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నది. ఓ కొత్త నివేదిక భారత టెక్ పరిశ్రమలో ఆందోళనలను రేకెత్తించింది. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ భారతదేశం నుంచి అమెరికాకు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు గణనీయంగా తగ్గాయని.. ఈ ఏడాది మే- ఆగస్టు మధ్య 58శాతం తగ్గిందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (%+u=×%) నివేదిక పేర్కొంది. మే 2.29 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశ స్మార్ట్ ఫోన్ ఎగుమతులు ఆగస్టులో కేవలం 964.8 మిలియన్లకు పడిపోయాయి. జూన్‌లో ఎగుమతులు 2 బిలియన్లు, జూలైలో 1.52 బిలియన్లకు తగ్గగా.. ఆగస్టు నాటికి భారీగా తగ్గాయి. జీటీఆర్ఐ దీన్ని ఆందోళనకరమైన పరిస్థితిగా పేర్కొంది.స్మార్ట్‌ఫోన్లపై కొత్త సుంకాలు విధించినందున ఈ తగ్గుదలను వెంటనే దర్యాప్తు చేయాలని పేర్కొంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఆగస్టులో కొన్ని ఉత్పత్తులపై సుంకాలు విధించారు. ఈ సుంకాలు మొదట్లో 10శాతంగా ఉండగా.. ఆగస్టు 27 నాటికి 25శాతానికి పెరిగాయి. ఆగస్టు 28 తర్వాత 50శాతానికి చేరుకున్నాయి. అయితే, ఈ సుంకాలు స్మార్ట్‌ఫోన్‌లకు కాకుండా వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, సీఫుడ్, రసాయనాలు, సోలార్ ప్యానెల్స్ వంటి ఉత్పత్తులకు వర్తిస్తాయి. అయినప్పటికీ, ఆగస్టు ఎగుమతుల్లో 28.5శాతం వాటా కలిగి ఉన్న సుంకం లేని ఉత్పత్తులు కూడా 41.9శాతం గణనీయమైన తగ్గుదలను చవిచూశాయి. ఈ కొత్త సుంకాల పూర్తి ప్రభావం సెప్టెంబర్‌లో ఉంటుందని.. ఇది ఎగుమతుల్లో మరింత తగ్గుదలకు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ఎగుమతులు తగ్గడం కేవలం సుంకాల వల్ల మాత్రమే కాదని.. వాటి వెనుక అనేక సవాళ్లు ఉండవచ్చని.. వాటిని పరిశోధించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది.

## వరుసగా నాలుగోరోజూ నష్టాలే




**ముంబై, సెప్టెంబర్ 24**
దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు భారీగా నష్టపోయాయి. బ్యాంకింగ్, వాహన, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు నష్టపోయిన సెన్సెక్స్ చివరకు 386.47 పాయింట్లు కోల్పోయి 81,715.63 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 112.60 పాయింట్లు కోల్పోయి 25,056.90 వద్ద స్థిరపడింది.

## ఫైనల్లో భారత్..బంగ్లాపై ఘన విజయం

# స్పోర్ట్స్

### రాణించిన అభిషేక్, కుల్దీప్
### సైఫ్ ఒంటరిపోరు వృథా



దుబాయ్
ఆసియా కప్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. టోర్నీలో అపజయమెరుగని టీమ్ఇండియా ..మరో మ్యాచ్ మిగిలుండగానే ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది. బుధవారం జరిగిన సూపర్-4 పోరులో భారత్ 41 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత టీమ్ఇండియా 20 ఓవర్లలో 168/6 స్కోరు చేసింది. అభిషేక్‌శర్మ(37 బంతుల్లో 75, 6ఫోర్లు, 5సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో చెలరేగగా, హార్దిక్ పాండ్యా(38) ఆఖర్లో చెలరేగాడు. రిషాద్(2/27)రెండు వికెట్లు తీశాడు. లక్ష్యఛేదనలో బంగ్లా 19.3 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. సైఫ్ హసన్(51 బంతుల్లో 69, 3ఫోర్లు, 5సిక్స్‌లు) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. కుల్దీప్‌యాదవ్ (3/18), బుమ్రా (2/18), వరుణ్ (2/29) జట్టు విజయంలో కీలకమయ్యారు.

**అభిషేక్ ధమాకా:**
టోర్నీలో సూపర్‌ఫామ్ మీదున్న అభిషేక్‌శర్మ మరోమారు అదరగొట్టాడు. ఆరు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న అభిషేక్..మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. మరో మూడు బంతుల తేడాతో కీపర్ జేకర్ అలీ క్యాచ్ విడిచిపెట్టడంతో అభిషేక్‌కు రెండో సారి లైఫ్ వచ్చింది. మరో ఎండ్‌లో శుభ్‌మన్ గిల్ మంచి పరిణతి కనబరిచాడు. నసుమ్ నాలుగో ఓవర్‌లో వరుస బంతుల్లో గిల్ ఫోర్, సిక్స్‌తో విరుచుకుపడగా, తానేం తక్కువ కాదన్నట్లు అభిషేక్ బ్యాటు ఝులిపిస్తూ సిక్స్ కొట్టడంతో 21 పరుగులు వచ్చాయి. మరుసటి ఓవర్‌లో ముస్తాఫిజుర్‌కు సిక్స్‌తో స్వాగతం పలికిన అభిషేక్ మరో సిక్స్‌తో ఆకట్టుకున్నాడు. తన దూకుడును మరో స్థాయికి తీసుకెళుతూ ఈ యువ బ్యాటర్ నాలుగు ఫోర్లతో 17 పరుగులు పిండుకోవడంతో పవర్‌ప్లే ముగిసే సరికి టీమ్ఇండియా వికెట్ నష్టపోకుండా 72 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన రిషాద్ హుస్సేన్ బౌలింగ్‌లో తొలి బంతిని ఫోర్‌గా బాదిన గిల్ మూడో బంతికి ఔటయ్యాడు. దీంతో తొలి వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ప్రమోషన్‌లో మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన శివమ్ దూబే(2) తీవ్ర నిరాశపరిచాడు. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుంటాడనుకున్న దూబే..రిషాద్ బౌలింగ్‌లో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ క్రమంలో అభిషేక్ 25 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్..అభిషేక్‌కు జతకలిశాడు. వీరిద్దరు ఇన్నింగ్స్ చక్కదిద్దుతారు అనుకున్న తరుణంలో ముస్తాఫిజుర్ 12వ ఓవర్‌లో అభిషేక్..రిషాద్ సూపర్ ఫీల్డింగ్‌తో రనౌట్ అయ్యాడు. ఇదే ఓవర్ ఆఖరి బంతికి సూర్య కూడా ఔట్ కావడంతో టీమ్ఇండియా 114కు నాలుగు వికెట్లు కోల్పోయింది. తిలక్‌వర్మ(5) ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. శాంసన్ కంటే ముందు వచ్చిన అక్షర్‌పటేల్(10 నాటౌట్) జిడ్డుగా ఆడగా, ఉన్నంతసేపు హార్దిక్‌పాండ్యా ట్రేడ్‌మార్క్ షాట్లు ఆడటంతో టీమ్ఇండియాకు పోరాడే స్కోరు దక్కింది. తొలి 10 ఓవర్లలో 96 పరుగులు చేసిన టీమ్ఇండియా..బంగ్లా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో చివరి 10 ఓవర్లలో 72 పరుగులకే పరిమితమైంది.

**సైఫ్ ఒంటరిపోరాటం:**
నిర్దేశిత లక్ష్యఛేదనలో బంగ్లాకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. బుమ్రా వేసిన రెండో ఓవర్‌లో భారీ షాట్ ఆడబోయిన తంజిద్ హసన్ (1)..దూబేకు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పర్వేజ్‌తో కలిసి సైఫ్ హసన్..భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. వరుణ్ 5వ ఓవర్‌లో మూడు ఫోర్లతో 13 పరుగులతో జోరు ప్రదర్శించాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన కుల్దీప్..పర్వేజ్‌ను ఔట్ చేయడంతో రెండో వికెట్‌కు 42 పరుగుల పార్టనర్‌షిప్‌నకు బ్రేక్ పడింది. హృదయ్(7) ఊరించే బంతితో అక్షర్ పటేల్ బోల్తా కొట్టించగా, షమీమ్ హుస్సేన్(0)ను వరుణ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా..సైఫ్ దూకుడు తగ్గించలేదు. ఈ క్రమంలో పలుమార్లు ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న సైఫ్ 36 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. సూర్యకుమార్ సూపర్‌త్రోతో అలీ(4) రనౌట్ కాగా, బంగ్లా వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. సైఫ్‌ను బుమ్రా పెవిలియన్ పంపగా, తిలక్ బౌలింగ్‌లో ముస్తాఫిజుర్(6) ఆఖరి వికెట్‌గా ఔటయ్యాడు.

**సంక్షిప్త స్కోర్లు**
భారత్: 20 ఓవర్లలో 168/6(అభిషేక్ 75, హార్దిక్ 38, రిషాద్ 2/27, తంజిమ్ 1/27), బంగ్లాదేశ్: 19.3 ఓవర్లలో 127 ఆలౌట్(సైఫ్ 69, పర్వేజ్ 21, కుల్దీప్ 3/18, బుమ్రా 2/18)

## వైభవ్ ధనాధన్

### యూత్ వన్డే సిరీస్ భారత్ సొంతం



బ్రిస్బేన్
ఐపీఎల్‌లో సంచలన ఆటతో క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ.. భారత్ తరఫునా జోరు కొనసాగిస్తున్నాడు. వైభవ్ (68 బంతుల్లో 70, 5 ఫోర్లు, 6 సిక్సర్లు), విహాన్ మల్హోత్ర (70), వికెట్ కీపర్ అభిగ్యాన్ (71) రాణించడంతో ఆస్ట్రేలియాతో జరుగుతున్న అండర్-19 యూత్ వన్డే సిరీస్‌లో భారత్ రెండో వన్డేలో గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0 ఆధిక్యం సాధించింది.బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 49.4 ఓవర్లలో 300 రన్స్ చేయగా ఛేదనలో ఆస్ట్రేలియా 249 పరుగులకే పరిమితమైంది. జైడన్ డ్రాపర్ (107) పోరాడాడు. భారత సారథి ఆయుష్ మాత్రె బ్యాట్‌తో విఫలమైనా బంతితో (3/27) రాణించాడు.

## షట్లర్ల ఇంటిబాట



సువాన్
కొరియా మాస్టర్స్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలిరోజే భారత షట్లర్లు ఇంటిబాట పట్టారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జి, ఆయుష్ శెట్టి మొదటి రౌండ్‌కే నిష్క్రమించారు. మహిళల సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్-లక్షిత అపజయం పాలయ్యారు.ఇండోనేషియా షట్లర్ చికో ఆరా ద్వి వర్దొయెతో జరిగిన మ్యాచ్‌లో మొదటి గేమ్ 16-8తో ఉండగా ప్రణయ్ గాయంతో రిటైర్డ్‌గా వెనుదిరిగాడు. ఆయుష్.. 18-21, 18-21తో చైనీస్ తైపీకి చెందిన సు లి యాంగ్ చేతిలో ఓడాడు. మరో పోరులో కిరణ్ జార్జి.. 14-21, 22-20, 14-21తో మాజీ వరల్డ్ చాంపియన్ లొ కీన్ యూ (సింగపూర్) చేతిలో పోరాడి ఓడాడు. ఉమెన్స్ సింగిల్స్‌లో అనుపమ.. 16-21, 15-21తో నాలుగో సీడ్, ప్రపంచ 8వ ర్యాంకర్ అయిన పుత్రి వర్దాని (ఇండోనేషియా) జోరు ముందు తలవంచింది.



# సందీప్ వంగా చిత్రంలో '8 వసంతాలు' భామ.?

మ్యాడ్, 8వసంతాలు వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యువ నటి అనంతిక సనీల్ కుమార్ మరో క్రేజీ ఆఫర్ దక్కించుకున్నట్లు తెలుస్తుంది. అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాలతో స్టార్ దర్శకుడిగా మారిన సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం ప్రభాస్‌తో కలిసి స్పిరిట్ అనే సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో తృప్తి డిమ్రీ కథానాయికగా నటించబోతుంది. త్వరలోనే ఈ చిత్రం సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ సినిమా సెట్స్ మీదకి వెళ్లకముందే ఒక చిన్న సినిమాను సందీప్ నిర్మించబోతున్నాడు. సందీప్ సొంత నిర్మాణ సంస్థ భద్రకాళి పిక్చర్స్‌పై రాబోతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా వేణు అనే కొత్త దర్శకుడు టాలీవుడ్‌కి పరిచయం కాబోతున్నాడు. ఈ చిత్రంలో 8వసంతాలు భామ అనంతిక సనీల్ కుమార్ హీరోయిన్‌గా ఎంపికైనట్లు సమాచారం. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. 'మేం ఫేమస్' ఫేమ్ సుమంత్ ప్రభాస్ ఇందులో హీరోగా కనిపించబోతున్నాడు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి మరిన్ని వివరాలను వెల్లడించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.




# నేడు విడుదలవుతున్న పవన్ ఓజి

## మిరాయ్ థియేటర్ల ఓజి సందడి

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన చిత్రం 'ఓజీ' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. పవన్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తోన్న ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం కోసం 'మిరాయ్' నిర్మాత విశ్వప్రసాద్ ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 12న తేజ సజ్జా నటించిన 'మిరాయ్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ చిత్రం ప్రదర్శితమవుతోన్న థియేటర్స్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత విశ్వప్రసాద్ పవన్‌కల్యాణ్ కోసం గొప్ప నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 25న 'మిరాయ్' థియేటర్స్ కొన్నింటిలో 'ఓజీ'ని ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చారు. మళ్లీ సెప్టెంబర్ 26 నుంచి యథాతథంగా ఆ థియేటర్స్‌లో 'మిరాయ్'ను ప్రదర్శించనున్నారు. దీంతో విశ్వప్రసాద్ నిర్ణయంపై పవన్ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. నార్త్ అమెరికాలో ఓజీ సినిమా డిజిటల్ ప్రింట్‌లు ఇంకా అందలేదని, కొన్ని కారణాల వల్ల కెనడాలో ఓజీ సినిమాను ప్రదర్శించడం లేదని ఇటీవల నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు వీటికి లైన్ క్లియరైంది. ప్రింట్‌లు అందినట్లు- డిస్ట్రిబ్యూటర్లు ఎక్స్ వేదికగా తెలిపారు.

# చీరలో చందమామలా.. అతిలోక సుందరి గారాలపట్టీ అందానికి ఫిదా అవ్వాల్సిందే!

అందాల ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు ఈ అమ్మడు తన అంద చందాలతో ఎంతో మంది మదిని దోచుకుంది. తాజాగా చీరలో తన అందంతో మరోసారి కట్టిపడేస్తుంది. మరి మీరు కూడా ఈ బ్యూటి లేటేస్ట్ క్యూట్ ఫొటోస్ పై ఓలుక్ వేయండి.బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ధడక్ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే మంచి ఫేమ్ సంపాదించుకుంది. తర్వాత వరసగా సినిమాలు చేస్తూ తన అంద, చందాలతో అందరిమనసు దోచేస్తుంది.ప్రస్తుతం ఈ బ్యూటీ టాలీవుడ్, బాలీవుడ్‌లో వరసగా సినిమాలు చేస్తూ తన క్యూట్ నెస్‌తో అందరిని మాయ చేస్తుంది. గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ సరసన దేవర మూవీలో నటించి తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది ఈ ముద్దుగుమ్మ.టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది. టాలీవుడ్ టు బాలీవుడ్ వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ అయిపోయింది. ముఖ్యంగా రామ్ చరణ్ సరసన ఓ మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ గనుక రిలీజ్ అయితే ఈ అమ్మడు క్రేజ్ మరింత పెరిగే ఛాన్స్ లేకపోలేదు.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా చీరలో తన అందంతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఈ ఫొటోస్ చూసిన వారందరూ బ్యూటిఫుల్, క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



# ప్రియుడితో దొరికిపోతున్న సమంత..

## దాని కోసమేనా

విడాకుల తర్వాత సమంత కాన్సన్‌ట్రేషన్ అంతా బాలీవుడ్‌పైనే ఉంది. తెలుగు ఇండస్ట్రీకి రమ్మన్నా రావట్లేదు. పైగా సినిమాల కంటే ఎక్కువగా వెబ్ సిరీస్‌లు మాత్రమే చేస్తున్నారీమే.రెండేళ్ల కింద విజయ్ దేవరకొండ ఖుషీ సినిమాలో నటించాక.. తెలుగులో కనిపించడమే మానేసారు స్యామ్. ప్రస్తుతం ఈమెపై క్రేజీ రూమర్స్ వస్తున్నాయి. కొన్నేళ్లుగా బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో సమంత డేట్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.సమంత నటించిన ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్ సిరీస్‌లను తెరకెక్కించిన దర్శకుల్లో రాజ్ ఒకరు. మరో దర్శకుడు %ణఖ%. ఈ ఇద్దరూ తెలుగు వాళ్లు. కొన్ని రోజులుగా దర్శకుడు రాజ్ నిడుమోరుతో తరుచూ జంటగా కనిపిస్తున్నారు సమంత. తాజాగా ఒకే జిమ్‌లో కలిసి కనిపించారు ఈ ఇద్దరూ.ఆ మధ్య ఓ పార్టీలో.. ఆ తర్వాత పికిల్‌బాల్ స్పోర్ట్స్ ఈవెంట్, కామన్ ఫ్రెండ్స్ పార్టీ, తర్వాత తిరుమలలో.. మొన్నామధ్య ఒకే కార్‌లో కలిసే కనిపించారు రాజ్ సమంత. తాజాగా ముంబైలోని జిమ్ దగ్గర కలిసి కనిపించారు.ఈ వీడియో వైరల్ అవుతుందిప్పుడు. ప్రస్తుతం స్యామ్ నటిస్తున్న రక్త్ బ్రహ్మాండ్ తెరకెక్కిస్తున్నది రాజ్ డికే ద్వయమే. ఇదంతా చూస్తుంటే తాను సింగిల్ కాదని స్యామ్ హింట్ ఇస్తున్నట్లే అనిపిస్తుంది.





Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492